నినాదం
https://hcusahityalahari.blogspot.com
# సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 2-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## కర్మ చారులు

బాణం గుర్తు కనిపిస్తుంది
లోపలికి దారిని చూపిస్తుంది
పూలదోసిలితో ఆహ్వానించే
సుస్వాగతం చిత్రపటముంది
ప్రవేశం సులభతరమైంది

పరస్పర నమస్కారాలు
సుతారపు కరచాలనాలు
హాస్యభరిత చతురోక్తులు
దెందానందపు ఆలింగనాలు
మృదుమధుర సంభాషణలు

అనేకానేకమైన సంగతులు
ఆత్మీయపు సందర్భములు
ఇంపు సొంపారు ఆవరణం
స్నేహపూర్వక వాతావరణం
అందర్నీ ఒకటిగా చేసిన బస

పరిపరి విధముల ప్రశంసలు
పూర్తిగా స్ఫూర్తితో పొగడ్తలు
ఆహ్వానితులకు సపర్యలు
ముగిసిన విందు వినోదాలు
బస నుంచి తిరుగు పయనం

బాణం గుర్తు కనిపిస్తుంది
బయటికి దారిని చూపిస్తుంది
కైమోడ్పులతో వీడ్కోలు పలికే
ధన్యవాదాలు చిత్రపటముంది
నిష్క్రమణ సుఖవంతమైంది

ఆనందాన్ని అనుభవించారు
నూతనానుభూతిని పొందారు
సురభిళాలను ఆస్వాదించారు
మధురసాలను చవిచూసారు
సర్వతోముఖంగా తేలిపోయారు

బస అస్తవ్యస్తమైపోయింది
మాలిన్యత పేరుకపోయింది
అపరిశుభ్రత తాండవిస్తుంది
సర్వత్రా చెత్తను తొలగించాలి
రేపటికి కొత్తగా సిద్ధం చేయాలి


నిష్ఫలమైన మాటలు కాదు
నేర్పుగా పనిచేసే తీరు కావాలి
పంచభూతములకు ప్రతిరూపం
కర్మచారులు కాలుమోపిన చోట
పుడమితల్లి పులకించి పోతుంది

**కనపర్తి రాజశేఖరమ్**
**7382847673**

# ప్రపంచాన్ని కొలిచిన మనిషి
## తనను తాను ఎందుకు కొలవలేకపోయాడు?

ప్రకృతిని గమనిస్తే ఒక ఆశ్చర్యకరమైన విషయం కనిపిస్తుంది. అక్కడ ఎవరికీ తొందర లేదు. సూర్యుడు ప్రతి ఉదయం తన సమయానికే ఉదయిస్తాడు. నది తన ప్రవాహాన్ని ఎప్పుడూ వేగవంతం చేసుకోదు. విత్తనం నేలను చీల్చుకుని మొక్కగా మారడానికి తనకు కావలసిన సమయాన్నే తీసుకుంటుంది. ఋతువులు ఒకదానికొకటి దారి ఇస్తాయి. ఒకదానిని మరొకటి తోసివేయవు. ప్రకృతిలో జీవనం కోసం పోరాటం ఉంటుంది, కానీ ఆధిపత్యం కోసం ఆత్రం ఉండదు. అక్కడ పోలికలతో కూడిన అహంకారం ఉండదు. గెలుపు--ఓటముల కంటే ఉనికికే ప్రాధాన్యం ఉంటుంది. కానీ అదే ప్రకృతిలో పుట్టిన మనిషి మాత్రం జీవించడానికి ముందే కొలవడం నేర్చుకున్నాడు. పగలు, రాత్రిని కాలంగా విభజించాడు. స్థలాన్ని దూరంగా మార్చాడు. కదలికను వేగంగా నిర్వచించాడు. తన జీవితాన్ని కాలం, వేగం, దూరం అనే మూడు కొలమానాలతో కొలవడం ప్రారంభించాడు. ఇవన్నీ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కనిపెట్టిన ప్రమాణాలే.

అయితే ఇక్కడే మనిషి ఓ చిన్న పొరపాటు చేశాడేమో? ప్రపంచాన్ని కొలవడానికి కనిపెట్టిన కాలం, వేగం, దూరం అనే ప్రమాణాలతో తన జీవితాన్నే కొలవడం ప్రారంభించాడు. అక్కడి నుంచే అతని గందరగోళం మొదలైంది. ఈ మూడు ప్రకృతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడినా, మనుషులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాయి. ఇద్దరి మధ్య దూరం ఎంత అని నిర్మిస్తే, ఎక్కువ కాలం కలిసి ఉన్న ప్రతి బంధం ఎందుకు బలంగా ఉండదు? తల్లిదండ్రులతో దశాబ్దాలు గడిపిన కొడుకు దూరమవుతాడు. ఐదేళ్లు కలిసి చదివిన స్నేహితులు పరాయివాళ్లవుతారు. మరోవైపు, కొద్ది నెలల పరిచయం జీవితాంతం నిలిచిపోతుంది. అప్పుడు కాలమే బంధాన్ని నిర్మించదు. కాలానికి అర్థం ఇచ్చిన అనుభవమే దాన్ని నిర్మిస్తుంది. కాలం మట్టి మాత్రమే. బంధం అందులో మొలిచే విత్తనం. అయితే ప్రతి మట్టిలో ప్రతి విత్తనం మొలవదు. అలాగే ప్రతి కాలం ప్రతి అనుబంధాన్ని నిలబెట్టదు. మట్టికి సారం అవసరమైనట్లే, కాలానికి



దూరం. విదేశాల్లో ఉన్న కొడుకుకోసం ఎదురుచూసే వృద్ధ తల్లికి ఒక సంవత్సరం కూడా అంతులేని దూరం. ఇక్కడ కిలోమీటర్లు మారలేదు. మారింది నిరీక్షణ. అందుకే దూరం భూమిపై ఉండదు. మనసులో ఉంటుంది.

మనిషి నాగరికత చేసిన అతిపెద్ద ప్రయత్నం దూరాన్ని తగ్గించడం. రహదారులు నిర్మించాడు. విమానాలు కనిపెట్టాడు. ఉపగ్రహాలు పంపించాడు. ఇప్పుడు సమాచారం కాంతి వేగంతో ప్రయా ణిస్తోంది. కానీ ఇక్కడ ఒక ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. దూరం తగ్గితే అనుబంధాలు ఎందుకు మరింత గాఢం కాలేదు? ఎందుకంటే మనిషి దూరాన్ని మాత్రమే తగ్గించాడు. నిరీక్షణను కూడా తగ్గించాడు. కానీ నిరీక్షణ నేర్పిన విలువను నిరంతర లభ్యత ఎప్పుడూ నేర్పలేకపోవచ్చు. ఎప్పుడైనా లభించేది అరుదుగా అనిపించదు. ఎప్పుడూ అందుబాటులో ఉండేది అమూల్యంగా అనిపించదు. ప్రకృతి దూరాన్ని శిక్షగా కాదు, విలువను నేర్పే పద్ధతిగా సృష్టించింది.
బహుశా అందుకేనేమో జీవితంలోని గొప్ప బంధాలు నిరీక్షణను తట్టుకుని నిలిచినవే. ప్రేమలో ఎదురుచూపు ఉంటుంది. స్నేహంలో విరామాలు ఉంటాయి. కుటుంబంలో అపార్థాలు ఉంటాయి. వీటిని దాటుకుని నిలిచిన అనుబంధాలకే లోతు వస్తుంది. పరీక్షలు లేని బంధాలు బలహీనంగా ఉంటాయి. కాలాన్ని దాటినవే జ్ఞాపకాలుగా మిగులుతాయి.

కిలోమీటర్లలో చెప్పగలం. కానీ వారి మధ్య అనుబంధం ఎంత అని ఏ ప్రమాణంతో కొలవాలి? ఒక వ్యక్తి జీవితకాలం ఎంత అనేది చెప్పగలం. కానీ అతను నిజంగా ఎంత జీవించాడు అనేది ఎలా చెప్పాలి? వేగాన్ని గంటకు కిలోమీటర్లలో కొలవచ్చు. కానీ ఒక బంధం ఎదగడానికి అవసరమైన వేగం ఎంత? ఇక్కడి నుంచే భౌతిక ప్రపంచం ముగుస్తుంది. తత్వశాస్త్రం ప్రారంభమవుతుంది.
కాలం, వేగం, దూరం వేర్వేరు అంశాలుగా కనిపిస్తాయి. కానీ అవి ఒకే వాస్తవానికి మూడు రూపాలు. దూరం లేకపోతే వేగానికి అర్థం లేదు. వేగం లేకపోతే కాలాన్ని కొలవలేం. కాలం లేకపోతే దూరం అనే భావనే ఉండదు. ప్రకృతిలో ఇవి పరస్పరాధారితమైనవి. కానీ మనిషి జీవితంలో ఇవి పరస్పర విరుద్ధాలుగా మారుతాయి. ఎందుకంటే ప్రకృతి వస్తువులను కదిలిస్తుంది. అనుబంధాలు మనసులను కదిలిస్తాయి. ఈ రెండింటికీ ఒకే సూత్రం వర్తించదు. ఆత్మీయత అనేది ఇద్దరు మనుషులు ఒకరినొకరు తెలుసుకోవడం వల్ల ఏర్పడదు. ఒకే కాలాన్ని కలిసి అనుభవించడం వల్ల ఏర్పడుతుంది. ఒక తరగతిలో నలభై మంది చదువుతారు. జీవితాంతం అందరూ స్నేహితులు కాలేరు. ఒకే కార్యాలయంలో వందల మంది పనిచేస్తారు. కొందరే ఆత్మీయులవుతారు. కారణం పరిచయం కాదు. కలిసి అనుభవించిన కాలం. ఆ కాలంలో పంచుకున్న నష్టం, ఆనందం, భయం, నిరీక్షణ, పోరాటం. అంటే కాలం అనేది గడియారం కదలిక కాదు; ఉమ్మడి అనుభవానికి మరో పేరు. ఇక్కడ ఒక ఆసక్తికరమైన ప్రశ్న వస్తుంది. కాలం అనుబంధాలను అర్థం అవసరం. అనుభవం లేని కాలం కేవలం గడిచిపోతుంది. అర్థవంతమైన కాలమే జీవితంగా మిగులుతుంది.

అదే విధంగా వేగం గురించి కూడా మనం ఒక భ్రమలో జీవిస్తున్నాం. వేగం అంటే త్వరగా చేరుకోవడమని అనుకుంటాం. కానీ జీవితం మనకు మరో విషయం చెబుతుంది. కొన్ని గమ్యాలు ఆలస్యంగా చేరుకున్నప్పుడే సంపూర్ణమవుతాయి. అలాగే తొందరగా ఏర్పడిన బంధాలు, వెంటనే తీసుకున్న నిర్ణయాలు, ఆవేశంలో పలికిన మాటలు ఇవన్నీ కాలం పరీక్షను తట్టుకోవు. వేగం ప్రయాణానికి ఉపయోగపడుతుంది. పరిణతికి కాదు. పరిణతి ఎప్పుడూ నెమ్మదినే కోరుతుంది. ఇది ప్రకృతి ధర్మం కూడా. నది పరుగెత్తుతుంది. కానీ లోయను చెక్కడానికి శతాబ్దాలు పడతాయి. గాలి క్షణాల్లో వీచిపోతుంది. కానీ కొండ ఆకారాన్ని మార్చడానికి యుగాలు పడతాయి. ఒక మెరుపు క్షణంలో కనిపిస్తుంది. కానీ ఒక వృక్షం ఎదగడానికి దశాబ్దాలు కావాలి. ప్రకృతి చెప్పే సందేశం స్పష్టంగా ఉంది. వేగం సంఘటనలను సృష్టిస్తుంది. కాలం స్వరూపాన్ని సృష్టిస్తుంది. మనిషి ఈ రెండింటినీ కలిపేసినప్పుడే గందరగోళం మొదలవుతుంది.

దూరం కూడా అలాంటిదే. మనం దూరాన్ని స్థలానికి సంబంధించినదిగా భావిస్తాం. కానీ నిజానికి దూరం ఒక మానసిక అనుభవం. ఎదురుచూడాల్సిన చోటే దూరం పుడుతుంది. ఎదురు చూడాల్సిన అవసరం లేకపోతే దూరం ఉండదు. తల్లి బయటకు వెళ్లిన ఐదేళ్ల పిల్లవాడికి ఐదు నిమిషాలు కూడా భరించలేని

చివరికి కాలం, వేగం, దూరం మనిషి జీవితాన్ని నడిపే మూడు శక్తులు కావు. అవి అతని జీవితాన్ని ప్రశ్నించే మూడు స్వరాలు. కాలం అడిగేది "నువ్వు ఎవరితో జీవించావు?" అని, వేగం అడిగేది "నువ్వు ఎక్కడికి పరిగెత్తావు?" అని, దూరం అడిగేది "ఎవరి కోసం తిరిగి వచ్చావు?" అని. ఈ మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం చెప్పగలిగినవాడే సంపూర్ణంగా జీవించిన మనిషి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మనిషి కాలాన్ని, వేగాన్ని, దూరాన్ని కనిపెట్టాడు. చివరికి తనను తాను అర్థం చేసుకోవడానికి వాటన్నింటినీ మరచిపోవాల్సి వచ్చింది. ఎందుకంటే జీవితాన్ని గడియారంతో కొలవడం సాధ్యం. ప్రయాణాన్ని స్పీడోమీటర్‌తో కొలవడం సాధ్యం. కానీ ఒక హృదయం ఇంకో హృదయాన్ని చేరే ప్రయాణాన్ని కొలిచే పరికరం ఎప్పటికీ పుట్టదు.

–కింజరాపు అమరావతి



## అందరి జీవితాలు ఒకేలా ఉండవు

కొందరు గోల్డెన్ స్పూన్ తో పుడితే
మరి కొందరు గోల్డ్, స్పూనూ లేని చోట
పుడతారు!
ఒకరి జీవితం పూలబాటలో సాగితే
మరొకరి బతుకు రాళ్ల బాటలో
తెల్లారిపోతుంది!
సృష్టిలో ఏ రెండు వేలిముద్రలు ఒకేలా
ఉండనట్టే
అందరి జీవితాలు ఒకే తీరున సాగవు!

వెలుతురులో గెలుపు వేట సాగించే వారు
కొందరైతే
చీకట్లో కన్నీటి పాట ఆలపించేవారు
మరికొందరు!
ఆకాశమంత ఎత్తులో ఆశల గాలిపటం
ఎగరేయడానికి చూసేవారు కొందరైతే
బ్రతుకు పడవకు అంతులేని చింతలతో
అతుకులు వేసుకునేవారు ఎందరో!

సూర్యచంద్రులు అందరికీ ఒక్కటే అయినా
తలుపులు తట్టే అదృష్టదారులు వేరు వేరు!
చూడ్డానికి అందరి గమ్యాలు ఒకేలా
కనిపించవచ్చు!
ప్రయాణంలోనే తేడాలు ఎదురవుతుంటాయి!
అప్రయత్నంగా విజయం సొంతం
చేసుకున్నవాడు
చక చక అందలం ఎక్కేస్తాడు!
ఓటమిని చవి చూసినవాడు డీలా పడిపోతాడు!
అందరి జీవితాలు ఒకేలా ఉండవు!

ఎవరి కథ వారిది!
ఎవరి బాధలు వాళ్ళవి!
పక్కవారితో పోల్చి చూసుకుంటే అంతా
వేదనాభరితమే!
విజయం సాధించడం వెనుక వాళ్ళ ఎంత
కన్నీరు కార్చుంటారో తెలియనట్టే
ఓడినవారి పోరాటం వెనుక గొప్పదనం
కొందరికి మాత్రమే అర్థమవుతుంది!

ఎవరి జీవితం పేజీలు వాళ్ళవి!
నీ పేజీలు నువ్వు చదువుకోవడం మానేసి
మరొకరి పేజీలోని అక్షరాల సంగతి
నీకెందుకు?
సరైన సిరాతో నీ సంతకాన్ని చేసుకో!
కాలానికి ఎవరూ అతీతులు కారు!
అందరి జీవితాలు ఒకేలా ఉండవు మరి!!

డా. గూటం స్వామి,
రాజమహేంద్రి
9441092870



## మనిషిని మలిచిన తెలుగు సాహిత్యం

**"దేశ భాషలందు తెలుగు లెస్స" అన్న మాట తెలుగుభాష మాధుర్యాన్నే కాదు, ఆ భాషలో రూపుదిద్దుకున్న సాహిత్య వైభవాన్నీ సూచిస్తుంది. ఒక జాతి అభివృద్ధిని కొలవడానికి ఆ దేశ సంపద, శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పురోగతి మాత్రమే ప్రమాణాలు కావు. ఆ సమాజంలోని మనుషులు ఎంత సంస్కారవంతంగా ఆలోచిస్తున్నారు? ఎంత మానవీయంగా జీవిస్తున్నారు? ఎంత నైతికంగా ప్రవర్తిస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు కూడా అంతే ముఖ్యమైనవి. అలాంటి మానవ వికాసానికి పునాది వేసే శక్తుల్లో సాహిత్యం అగ్రగామి. ముఖ్యంగా తెలుగు సాహిత్యం వెయ్యి సంవత్సరాలకు పైగా తన సృజనతో తెలుగు సమాజానికి జ్ఞానాన్ని, విలువలను, సంస్కృతిని, సామాజిక చైతన్యాన్ని అందిస్తూ మానవ అభివృద్ధికి దిశానిర్దేశం చేసింది.**

మానవ అభివృద్ధి అంటే కేవలం భౌతిక ప్రగతి కాదు. "ఆలోచనలో పరిపక్వత, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలు వలు, సామాజిక బాధ్యత, సృజనాత్మక దృక్పథం, సహజీవన భావన" ఇవన్నీ కలిసి మానవ అభివృద్ధిని నిర్మిస్తాయి. ఈ విలువలను తరతరాలకు అందించిన సాధనం తెలుగు సాహిత్యం. అది కేవలం పదాల సమాహారం కాదు. మనిషి అనుభవానికి అద్దం, సమాజానికి మార్గదర్శి. శాస్త్రం మనిషి జీవితాన్ని సౌకర్యవంతం చేస్తే, సాహిత్యం జీవితాన్ని సార్థకం చేస్తుంది. సాహిత్యం మనిషి మనస్సును మలిచే, సమాజ చైతన్యాన్ని నిర్మించే సృజనాత్మక శక్తి.

నన్నయ ప్రారంభించిన మహాభారత అనువాదం ద్వారా సంస్కృత జ్ఞానం తెలుగువారికి చేరువైంది. తిక్కన, ఎర్రప్రగడ ఆ మహోన్నత కృషిని పూర్తి చేసి భాషకు సాహిత్య గాంభీర్యాన్ని, ప్రజలకు జ్ఞానసంపదను అందించారు. భాష ఒక జాతి ఆత్మ అయితే సాహిత్యం ఆ ఆత్మకు చైతన్యాన్ని ప్రసాదించే శక్తి. తెలుగు సాహిత్యం మానవ జీవితానికి నైతిక విలువలను నేర్పిన గురువుగా నిలిచింది. వేమన పద్యాలు చదివిన ప్రతి ఒక్కరికీ నీతి, నిజాయితీ, వినయం, వివేకం జీవితంలో ఎంత ముఖ్యమో అర్థమవుతుంది. సుమతీ శతకం బాల్యంలోనే మంచి నడవడికను అలవర్చే పాఠ్యగ్రంథంగా నిలిచింది. భక్తి సాహిత్యం భగవంతుని ఆరాధనతో పాటు దయ, క్షమ, సమానత్వం, సేవ వంటి మానవీయ గుణాలను పెంపొందించింది. ఈ రచనలు కేవలం సాహిత్య సంపద మాత్రమే కాదు. వ్యక్తిత్వ వికాసానికి మార్గసూచికలు కూడా.

సమాజంలో మార్పు తీసుకురావడంలో తెలుగు సాహిత్యం పోషించిన పాత్ర విశిష్టమైనది. సమాజాన్ని పట్టిపీడించిన మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, స్త్రీలపై వివక్ష, సామాజిక అసమానతలను సాహిత్యం ధైర్యంగా ప్రశ్నించింది. నవలలు, నాటకాలు, వ్యాసాలు ప్రజల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికాయి. సాహిత్యం కేవలం వాస్తవాలను చిత్రించలేదు. వాటిని మార్చడానికి అవసరమైన చైతన్యాన్ని కూడా కలిగించింది. అందుకే కలం అనేక సందర్భాల్లో ఖడ్గం కంటే శక్తివంతమైంది. మానవ సమానత్వాన్ని తెలుగు సాహిత్యం నిరంతరం సమర్థించింది. కులం, మతం, వర్గం అనే భేదాల కంటే మానవత్వమే గొప్పదని అనేక రచనలు బోధించాయి. అభ్యుదయ సాహిత్యం పేదల జీవితం, కార్మికుల శ్రమ, రైతుల కష్టాలను సమాజం ముందు నిలబెట్టింది. శ్రమకు గౌరవం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు వంటి భావనలు సాహిత్యం ద్వారా విస్తృతంగా వ్యాపించాయి. మంచి సమాజ నిర్మాణానికి మంచి మనుషులు అవసరమని తెలుగు సాహిత్యం ఎప్పటికప్పుడు గుర్తు చేసింది.


స్త్రీ సాధికారతకు కూడా తెలుగు సాహిత్యం విశేషంగా దోహదపడింది. స్త్రీ విద్య, ఆత్మగౌరవం, స్వతంత్ర ఆలోచన, సమాన హక్కులు వంటి అంశాలు అనేక రచనల్లో ప్రధానంగా ప్రతిధ్వనించాయి. తెలుగు సాహిత్యం సంస్కృతిని కాపాడిన అపూర్వ భాండాగారం. జానపద గేయాలు, కథలు, సామెతలు, పద్యాలు, యక్షగానాలు, హరికథలు, బుర్రకథలు ప్రజల జీవనవిధానాన్ని, సంప్రదాయాలను, స్థానిక జ్ఞానాన్ని తరతరాలకు అందించాయి. భాషను కాపాడటమే కాదు, జీవన విలువలను కూడా సంరక్షించాయి. నేటి డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్యం కొత్త రూపాలను సంతరించుకుంటోంది. ఈ-పుస్తకాలు, ఆడియో పుస్తకాలు, డిజిటల్ గ్రంథాలయాలు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు రచనలు ప్రపంచవ్యాప్తంగా పాఠకులను చేరుతున్నాయి. అయితే పఠన అలవాటు తగ్గడం, తక్షణ వినోదానికి అలవాటు పడటం, మాతృభాష పట్ల నిర్లక్ష్యం వంటి సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. అందువల్ల పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు తెలుగు సాహిత్య పఠనాన్ని ప్రోత్సహించడం, గ్రంథాలయాలను బలోపేతం చేయడం, యువ రచయితలకు అవకాశాలు కల్పించడం కాలానుగుణ అవసరం.

అందువల్ల తెలుగు సాహిత్యాన్ని కేవలం పాఠ్యాంశంగా లేదా వినోద సాధనంగా చూడలేం. అది మానవ విలువలకు జీవం పోసిన జీవన దర్శనం. సమాజాన్ని సంస్కరించిన సంస్కరణోద్యమం. మనిషిని మనిషిగా నిలబెట్టిన మానవతా తత్వం. తెలుగు భాష ఉన్నంత కాలం తెలుగు సాహిత్యం మనిషి అంతరంగాన్ని వెలిగిస్తూ మానవ అభివృద్ధి ప్రయాణంలో శాశ్వత మార్గదర్శిగా నిలుస్తూనే ఉంటుంది.

**విర్గో : 8247045230**

# ఏకాకిగా మిగిలిన కాకి

అడవిలో అనేక రకాలైన పక్షులు జీవ జంతువులు ఉన్నాయి. వివిధ పక్షుల జంతువుల ధ్వనులను ప్రతిధ్వనిస్తూ ఆ అడవి ఎంతో అద్భుతంగా ఉంది. ఈ అడవిలో ఒక కాకి, ఒక పావురం, ఒక చిలుక, ఈ మూడు చాలా స్నేహంగా ఉంటూ తమ జీవితాన్ని గడుపుతున్నాయి. వెలుగు ఉన్న జీవితంలో చీకటి వచ్చినట్టు ఒక విషాదమైన సంఘటన జరిగింది.ఒకరోజు ఒక వేటగాడు అడవికి వెళ్ళాడు తనకు పావురం కనిపించింది ఆ పావురాన్ని కొట్టగా పావురానికి చిన్న గాయం అనేది అయింది. వేటగాడు పావురం చనిపోయింది అని అనుకున్నాడు కానీ పావురం ఒక్కసారిగా పైకి లేచి ఎగిరింది.పావురం వెళ్లి తను నివాసంగా ఉన్న చెట్టు దగ్గరికి వెళ్లి. తన గాయాన్ని చూసుకుంటూ చాలా బాధపడుతుంది. అప్పుడే అక్కడికి కాకి వచ్చింది. ఏం జరిగింది మిత్రమా అలా దిగులుగా ఉన్నావు అని అడిగింది. పావురం తన గాయం గురించి కాకి చెబితే తను బాధ పడుతుందని చెప్పలేదు. కాకి ఏం జరిగిందో చెప్పు అని అడగగా పావురం జరిగిన విషయం చెప్పింది ఆ విషయం తెలిసిన కాకి గాయాన్ని చూస్తూ విలవిలలాడింది. కాకి అప్పుడే ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. అడవిలో ఏమైనా గాయానికి సంబంధించిన మొక్కలు ఉండవచ్చు అని ఆలోచించి వెంటనే వెళ్లి వాటిని వెతక సాగింది. అప్పుడు కాకికి కుందేలు కనిపించింది తనకు గాయానికి సంబంధించిన మొక్కలు ఏమైనా తెలిసేమోనని అడగగా కుందేలు ఆ మొక్కలు ఎక్కడ ఉంటాయో చెప్పింది అక్కడికి వెళ్లి వాటిని తీసుకుని పావురం దగ్గరికి వెళ్ళింది. ఆ మొక్కలను తన నోటితో నమిలి పావురం గాయం మీద దాన్ని పెట్టింది కొద్దిసేపటి తరువాత ఆ పావురం గాయం తగ్గి సంతోషంగా కనిపించింది. అదే సమయంలో చిలుక అడవిలో తిరుగుతుండగా కుందేలు కనిపించి పావురం చిలుకతో ఇలా చెప్పింది మీ మిత్రురాలు అయినా కాకి



గాయం కోసం సంబంధించిన మొక్కలు ఎక్కడ నాకు అడగగా నేను వాటి జాడను చెప్పాను అని కుందేలు చెప్పింది . మీ మిత్రులకు ఏదైనా సమస్య ఉందేమో చిలుకతో చెప్పింది. వెంటనే చిలుక తమ స్నేహితుల దగ్గరికి వెళ్ళింది. అప్పుడు పావురానికి గాయం అయిన విషయం తెలిసి చిలుక చాలా బాధపడింది. ఇలా ఈ ముగ్గురు స్నేహితులు అడవిలో ప్రశాంతంగా ఆడుకుంటూ ఉన్న సమయంలో చిలుక రెక్కలకు చిన్న గాయం అయింది దీనితో ఆ చిలుక ఎగరలేక పోతుంది. ఇలా చిలుక ఎగర లేకపోవడం వలన దానికి ఆహారం సేకరించడం చాలా కష్టంగా అవుతుంది. పావురం మరియు కాకి చిలుకను తమ నివాస స్థలానికి తీసుకువెళ్లాయి. చిలుకకు రోజు ఆహారాన్ని కాకి తీసుకువచ్చి ఇచ్చేది. ఇలా కొన్ని రోజుల తర్వాత చిలుక గాయం తగ్గిపోయింది. ఇలా ఈ ముగ్గురు పక్షులు తమ జీవితాన్ని గడుపుతున్నాయి.

అదే సమయంలో ఆ అడవికి వేరే రెండు పక్షులు వచ్చాయి అందులో ఒకటి చిలుక మరొకటి పావురం. ఇప్పుడు ఈ ఐదు పక్షులు చాలా స్నేహపూర్వకంగా అడవిలో తిరుగుతూ ఉన్నాయి. ఒకరోజు ఏం జరిగిందో తెలియదు. కాకి తన స్నేహితుల నివాసం దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ తమ స్నేహితులు లేరు. కొత్తగా వచ్చిన స్నేహితులతో చిలుక మరియు పావురం కలిసి వెళ్లిపోయాయి. ఎటు వెళ్లిన విషయం కూడా కాకికి తెలియదు. పావురం గాయం చెంది కష్టాల్లో ఉన్నప్పుడు దానికి గాయం తగ్గించడానికి సహాయం చేసింది అలాగే చిలుకకు ఎగరడం కష్టంగా ఉన్నప్పుడు ఆహారం సేకరించడం కష్టంగా ఉన్న సమయంలో వాటికి చాలా సహాయం చేసింది కానీ ఆ సహాయాన్ని మరిచి కాకి చేసిన ఉపకారాన్ని మరిచిపోయి కొత్తగా పరిచయం అయిన స్నేహితులతో కలిసి కష్టాల్లో తమకు తోడుగా ఉన్నటువంటి కాకిని ఒంటరి చేసి వెళ్లిపోయాయి. స్నేహం అంటే అవధులు లేని ప్రేమ, నిస్వార్థమైన నమ్మకం, మరియు జీవితాంతం తోడుండే బంధం. స్నేహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం మరియు మానసిక ప్రశాంతతను ఇచ్చేదిగా ఉండాలి. కానీ, స్వార్థం, అవసరానికి మాత్రమే వాడుకోవడం, మోసం, నిరంతరం విమర్శించడం, మరియు నమ్మకద్రోహం వంటి లక్షణాలు ఉన్న వ్యక్తితో స్నేహం అస్సలు ఉండకూడదు. తమ స్నేహితులు విడిచి వెళ్లిపోవడం వలన ఈకాకి ఏకాకిగా మిగిలిపోయింది.

నీతి : మనకు కష్టాల్లో ఆదుకున్న వారిని ఎప్పుడూ మర్చిపోకూడదుం

– కె.శ్రీనివాస్ సింగ్



## కాంతి రేఖలు

అంధకారం ఆవహించిన
నేటి నిరాసక్త సమాజం పై
వెలుగు రేఖనై
విచ్చుకుంటాను
వేకువనై నేనొస్తాను

కాలుష్య రక్కసి
రాజ్య మేలుతున్న
కారు చీకటి
సుడిగుండాల నుండి
ప్రజావాహిని ని రక్షించగా
వెలుగు రేఖనై
విచ్చుకుంటాను
వేకువనై నేనొస్తాను

విద్యయే నేడు
జగతికి దిక్సూచి
విద్యయే ఉన్నత
విలువలు నేర్పేది
విద్య గొప్పదనం
వివరింపగా
వెలుగు రేఖనై
విచ్చుకుంటాను
వేకువనై నేనొస్తాను

మానవత్వం కానరాని
మతాన్ని
కుల దురహంకారాన్ని
పాతి పెట్టి
సమ సమాజ
నిర్మాణానికై
పునాదిరాళ్లు
పేర్చడానికై
వెలుగు రేఖనై
విచ్చుకుంటాను
వేకువనై నేనొస్తాను.



రచన : బాసరాజు యాదగిరి
స్కూల్ అసిస్టెంట్ (జీ. శా.)
చరవాణి : 9866255775

నినాదం

https://hcusahityalahari.blogspot.com

# సాహిత్య లహరి


Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,

ఆదివారం 2-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064




'వాము' సంపుటిలో సంపాదకులు 'శ్రమ సౌందర్యం' గురించి క్లుప్తంగా ప్రస్తావించారు. నిజానికి ఈ సంపుటిలోని ప్రతి కథ, ఏదో ఒక మలుపులో, పెద్ద సాంకేతిక పదజాలం లేకుండానే, సహజమైన తెలంగాణ తెలుగులో ఒక ప్రత్యేక అందాన్ని ఆవిష్కరిస్తుంది. కేవలం గొప్ప శిల్పాలు, చిత్రలేఖనాలు మాత్రమే కళ కాదని, దైనందిన శ్రమలో కూడా ఒక లోతైన సౌందర్యం దాగి ఉందనే ఆలోచనతో ఈ వ్యాసం రాయబడింది. ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న తలెత్తుతుంది - 'కళ, సౌందర్యం, నైపుణ్యం' అనేవి నిజానికి ఎవరికి చెందాలి? వాస్తవానికి వీటిపై అధికారం బడుగు, బలహీన వర్గాలకూ ఉంది. బీసీ వృత్తుల్లోని మనుషులు తమ పని ద్వారానే సౌందర్యాన్ని వ్యక్తం చేస్తారు, ఉపన్యాసాలు ఇవ్వరు. కానీ దురదృష్టవశాత్తు ఈ కళాత్మక దృక్పథాన్ని విశ్వవిద్యాలయాల్లో గానీ, సాహిత్య విమర్శలో గానీ పెద్దగా చర్చించిన దాఖలాలు లేవు. సౌందర్య శాస్త్రం, తత్వశాస్త్రం వంటి పెద్ద అంశాలను సంప్రదాయ విమర్శకుల ఆలోచనలకే పరిమితం చేసి, మిగిలిన వాటిని ఉపేక్షించారు....

ప్రస్తుత వ్యాసం తెలుగు ప్రాంతాల్లోని అన్ని బీసీ వృత్తులను చర్చించదు, ఇది చాలా విశాలమైన పరిశోధన అంశం. ఈ వ్యాసం కుమ్మరి వృత్తి సాంస్కృతిక అనుభవాలకే తన పరిశీలనను పరిమితం చేస్తుంది. ఇందులో ప్రతిపాదించే ప్రధాన వాదన ఏమిటంటే, 'వాము' కథలు కుమ్మరి వృత్తిని కేవలం సామాజిక వాస్తవికతగా చిత్రించడమే కాక, దైనందిన శ్రమలో అంతర్లీనమైన ఒక సూక్ష్మ సౌందర్యానుభవాన్ని తెలుపుతుంది. ఈ సంపుటిలోని కథలను సౌందర్య శాస్త్రంలో ఒక భాగమైన 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' (Micro Aesthetics) అనే కోణం నుండి విశ్లేషించడమే ఈ వ్యాస లక్ష్యం.

## మట్టి పరిమళం – శ్రామిక ఆత్మగౌరవం

# 'వాము' కథల్లో సూక్ష్మ సౌందర్యశాస్త్రం



ప్రొఫెసర్ వెంకటరామయ్య గంపా
డిపార్ట్ మెంట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ అండ్ లిటరరీ స్టడీస్
ఢిల్లీ యూనివర్సిటీ : 9958607789

**కథల సంపుటి ముఖచిత్రం- మౌనంగా మాట్లాడే శ్రమ సౌందర్యం:**


'వాము' పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నప్పుడు కవర్ పేజీ మౌనంగా మాట్లాడే శ్రమ సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. కుమ్మరి కొలిమి మంటలు, కుండల అమరిక తక్షణమే దృష్టిని ఆకర్షించినా, మన చూపు ఆగేది మాత్రం మొత్తం ముఖచిత్రం కూర్పు మీదనే. ఇది కేవలం ఒక దృశ్య రూపకల్పన మాత్రమే కాదు, బీసీల బతుకుల అంతరంగాన్ని, శ్రమ సంస్కృతిని, మట్టితో ముడిపడిన జీవిత తత్వాన్ని సున్నితంగా ఆవిష్కరించే ఒక సూక్ష్మ సౌందర్యశాస్త్ర ప్రయోగం. స్థూలంగా చూస్తే కుమ్మరుల జీవితం కనిపిస్తుంది. కానీ దాని అంతరాళంలోని అగోచర క్షణాలు, వస్తు తత్వం, సాంస్కృతిక రూపకాలు గాఢమైన సాహిత్య విమర్శకు తావునిస్తాయి. ముందుగా, ఈ ముఖచిత్రంలో అగ్ని, మట్టి మధ్య సంవాదం కేంద్రంగా నిలుస్తుంది. కుమ్మరి బట్టీ కాలుతున్న తీరు, కుండల అమరిక భౌతిక శ్రమతో పాటు పంచభూతాలతో మనిషి చేసే నిరంతర సంభాషణను సూచిస్తాయి. మండుతున్న అగ్నికీలలు, వాటి నుంచి లేచే నల్లని పొగ కేవలం రసాయనిక మార్పుకు చిహ్నాలు మాత్రమే కాదు, అవి శ్రామికుడి నిట్టూర్పులకు, అతని జీవన పోరాటాల అణగారిన వేదనకు దృశ్యరూపాలు. చిత్రంలో కుమ్మరి ఒంపుసొంపులుగా మంటను సర్దుతున్న భంగిమ ఒక విచిత్రమైన ఏకాగ్రతను, దైవికమనిపించే ప్రశాంతతను ప్రదర్శిస్తుంది. ఇది కుండ కాల్చడం మాత్రమే కాదు, రూపాన్ని ఆవిష్కరించే సృష్టికర్త తపస్సులా అనిపిస్తుంది. చిత్రకారుడు ఉద్దేశపూర్వ కంగా కుమ్మరి ముఖాన్ని అస్పష్టంగా ఉంచాడు. ఈ నిర్ణయం వల్ల ఆ వ్యక్తి ఒక్కడే కాక, కులవృత్తిలోని ప్రతి కుమ్మరికీ ప్రతినిధిగా మారి సార్వత్రికతను సంతరించుకుంటాడు.

శీర్షిక అక్షరాల విషయానికి వస్తే, 'వాము' పదం మట్టి రంగుల తెల్లటి ఛాయలతో, కుండల ఆకృతులను తలపించేలా తీర్చిదిద్దబడింది. అక్షరాలు కంప్యూటర్‌లో టైపు చేసిన అక్షరాల్లాగా యాంత్రికంగా లేవు, మట్టితో చేసిన శిల్పాల్లా సహజమైన వంపులతో ప్రవహిస్తున్నాయి. దాని కింద 'కుమ్మరుల బతుకు చక్రాలు' అనే ఉపశీర్షిక శ్రమను కాలంతో ముడిపెడుతుంది. కుమ్మరి చక్రం గిరికీలు కొట్టే కాలచక్రానికి ప్రతీక–కాలం ఎంత మారినా చక్రం తిరుగుతూనే ఉంటుంది. మట్టి రూపాలు మారవచ్చు కానీ ఆ బతుకుల గతి మాత్రం ఆగిపోదు అనే తాత్విక సత్యం ఈ కథల సంపుటి కవర్ డిజైన్‌లో దృశ్యమానమవుతుంది.

చిత్ర కూర్పు ఒక విశేషమైన శ్రేణిని అనుసరిస్తుంది. నేపథ్యంలో పచ్చని చెట్టు, చిన్నపాటి ఊరు, గుడిసెలు సామూహిక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి. అక్కడి నుంచి దృష్టి క్రమంగా మధ్యభాగంలోని కేంద్రీకృత కుండల బట్టీ మీదకు, శ్రామికుడి శ్రమ మీదకు మళ్ళుతుంది. విశాల ప్రపంచం నుంచి ఒక నిర్దిష్ట శ్రామిక కుటుంబపు సూక్ష్మ వేదనలోకి చూపు మళ్ళించిన అనుభూతిని ఈ కూర్పు కలిగిస్తుంది. ఇది కేవలం సాంకేతిక నైపుణ్యం కాదు, ఒక సామాజిక వ్యాఖ్య కూడా. వాటర్ కలర్ మాధ్యమం చిత్రానికి ఒక ప్రత్యేక ఆర్ద్రతను, కాలం చెల్లిన జ్ఞాపకాల సువాసనను అద్దింది. రంగులు ఎక్కడా కృతకంగా లేవు. మట్టితో మమేకమైన బతుకులు ఎంత సౌమ్యంగా, నిరాడంబరంగా ఉంటాయో ఈ రంగుల కూర్పు సున్నితంగా తెలియజేస్తుంది. చివరగా, చిత్రంలో పనిచేస్తున్న కుమ్మరి చుట్టూ గాఢమైన నిశ్శబ్దం ఆవరించి ఉంది. ఈ నిశ్శబ్దం శతాబ్దాలుగా అణచివేయబడిన కులవృత్తి పడుతున్న ఒంటరి పోరాటానికి, యంత్ర నాగరికత మధ్య కనుమరుగవుతున్న హస్తకళల ఆక్రందనకు ప్రతీక. ఈ నిశ్శబ్దాన్ని రంగుల్లో పట్టగలగడమే ఈ దృశ్య కావ్యం నిజమైన శక్తి. ఈ ముఖచిత్రం పుస్తకం లోపలి కథలకు కేవలం సూచిక కాదు, అది ఒక స్వతంత్ర దృశ్య కావ్యం. పాఠకుడు తన అనుభవాల నుండి మట్టి వాసనను, చెమట చుక్కల వేడిని అనుభూతి చెందేలా చేయడంలో, శ్రమను సౌందర్యంగా మలచడంలో, బీసీల జీవన రేఖలను పదునైన కుంచెతో అద్దడంలో ఈ ముఖచిత్రం సంపూర్ణంగా సఫలమైంది.

**సూక్ష్మ సౌందర్యశాస్త్రం:**

సాధారణంలో అసాధారణం ముఖచిత్రంలో కనిపించే ఈ లోతైన సౌందర్యం, సాహిత్య విమర్శలో 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనే ఒక ప్రత్యేక దృక్కోణానికి దారితీస్తుంది. ఇది గొప్ప కళాఖండాల్లో, రాజభవనాల్లో వెతికే అందం గురించి కాదు. మన రోజువారీ జీవితంలో భాగమైన చేత్తో తాకే, కంట పడే, ముక్కుతో వాసన పట్టే మామూలు వస్తువుల అందం గురించి మాట్లాడుతుంది. కుండ సరిగ్గా అలాంటిదే. దానికొక ఆకారం, స్పర్శ, రంగు, వాసన ఉన్నాయి. ఇవన్నీ కలగలిసి ఒక సౌందర్యానుభూతిని కలిగిస్తాయి. ఈ సంపుటిలోని కథలు చాలా చోట్ల ఈ సూక్ష్మ సౌందర్యాన్ని ప్రత్యక్షం చేస్తాయి. చేతిపని మీద గౌరవం, అది కనుమరుగవుతున్న తీరు వీటి చుట్టూనే కథనం తిరుగుతుంది. కుమ్మరి పనిలో అత్యంత ఆసక్తికరమైన సౌందర్య ఘట్టం మట్టిముద్ద చక్రం మీద ఆకారం తీసుకోవడం. ఇది కేవలం తయారీ దశ కాదు, ఒక కళాత్మక చర్య. అతని చేతి వేళ్ళ కదలిక, చక్రం తిరిగే వేగం, మట్టి తడి – ఇవన్నీ కలిస్తేగానీ కుండ దాని రూపు దాల్చదు. శరీరం, పరికరం, పదార్థం మూడూ ఒకదానితో ఒకటి మాట్లాడు కుంటాయి. ఆ చేతుల్లో తరాల జ్ఞాపకం, తండ్రి నుంచి వచ్చిన నైపుణ్యం, ఒక లయ అన్నీ ఇమిడి ఉంటాయి.



ఈ అనుభవాన్ని సిద్ధాంతీకరించడానికి థామస్ లెడ్డీ తన The Extraordinary in the Ordinary అనే పుస్తకంలో ఒక కీలకమైన ప్రతిపాదన చేస్తాడు. సాధారణమైనది (ordinary) తనలో అసాధారణతను (extraordinary) దాచుకుంటుంది. మనం రోజూ చూసే వస్తువుల్ని అతి పరిచయం వల్ల చూడటం మానేస్తాం. కానీ థామస్ లెడ్డీ చెప్పే 'అసాధారణత' అనేది అరుదైనది కాదు, ఒక అనుభవ తీవ్రత. కుమ్మరి ప్రతిరోజూ చేసే పని, సంవత్సరాల సాధన వల్ల వచ్చిన నైపుణ్యం ఆ దైనందిన చర్యను ఒక అసాధారణ స్థాయికి తీసుకువెళ్తాయి. థామస్ లెడ్డీ దీన్ని 'అభ్యాసం ద్వారా వచ్చే అసాధారణ నైపుణ్య లోతు'గా పేర్కొంటాడు. పునరావృతం బోర్ కొట్టించదు, అది లోతును పెంచుతుంది. వెయ్యవ కుండ చేస్తున్నప్పుడు కుమ్మరి చేతికున్న సున్నితత్వం మొదటి కుండకు ఉండదు. ('వాము' సంపుటిలోని కథలు ఈ థామస్ లెడ్డీ సూత్రాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ఒక కథలో వృద్ధ కుమ్మరి వణుకుతున్న వేళ్ళ వర్ణన కనిపిస్తుంది. ఆ వయసు ఒక బలహీనతగా కాక, దశాబ్దాల శ్రమతో గడించిన ఆస్తిగా చిత్రించబడింది. ఆ వణుకుడు కూడా ఖచ్చితమైన ఆకారాన్ని సృష్టిస్తుంది. ఇది కేవలం తరాల నైపుణ్యాన్ని చూపించే ఉపకరణం కాదు, థామస్ లెడ్డీ చెప్పిన సాధన లోతు నిర్మాణ రూపం. అయితే ఈ సౌందర్యం కేవలం ఆనందంతో మాత్రమే నిండి ఉండదు. థామస్ లెడ్డీ మరో ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావిస్తాడు – దైనందిన సౌందర్య అనుభవాలు చాలావరకు మిశ్రమ భావోద్వేగాలతో కూడి ఉంటాయి. కేవలం స్వచ్ఛమైన ఆనందమే సౌందర్యం కాదు, దుఃఖం కలగలిసిన ప్రశంస, నష్టభావం మిళితమైన మెప్పు కూడా గాఢమైన అనుభవాలే. ఈ సంపుటిలోని కథలు చాలావరకు ఈ సంయుక్త భావ స్వరంతోనే నడుస్తాయి.

**కథల విశ్లేషణ:** సౌందర్యం, జ్ఞాపకం, సంక్షోభం ఈ 'వాము' కథల్లో వస్తువులు జ్ఞాపకాల నిల్వ కేంద్రాలుగా కనిపిస్తాయి. కుండలు కేవలం నేపథ్యంలో అలంకారాలుగా మిగలవు, అవి కథాగమ నానికి చుక్కాని అవుతాయి. పెళ్ళి అంటే బోనం కుండ, చావు అంటే తద్దినం కుండ – తెలుగు పల్లె జీవితంలో ప్రతి కీలక ఘట్టానికీ ఒక కుండ ముడిపడి ఉంటుంది. ఒక్కో సంద ర్భానికి ఒక్కో ఆకారం, ఒక్కో అలం కారం. ఈ కథలు చదివిన తర్వాత, ఆ వస్తువు వెనుక సామాజిక బరువు, ఎవరు చేస్తున్నారు, ఎంత కష్టపడుతున్నారు అన్న స్పృహ మెరుస్తుంది. 'ఐరేణి కుండలు' కథ ఈ సంయుక్త భావోద్వేగానికి ఒక గొప్ప ఉదాహరణ. పాఠకుడు కుండ అందాన్ని ఆస్వాదిస్తూనే, ఆ కళ క్షీణిస్తోందేమో అన్న ఆందో ళనను ఒకేసారి అనుభవిస్తాడు. పట్టణం వెళ్ళిపోయిన కొడుకుల కోసం తల్లి రంగురంగుల కుండల్ని జాగ్రత్తగా దాచిపెట్టే సన్నివేశం, సంప్రదాయానికీ ఆధునికతకూ మధ్య ఘర్షణను సూక్ష్మ సౌందర్యం తో మేళవిస్తుంది. కొడుకు పెళ్ళికి ఆ మట్టి కుండలే కావాలనే తల్లి పట్టుదల కేవలం సెంటిమెంట్ కాదు, ఒక సౌందర్య నిర్ణయం. సరళమైన ఆనందం కాదు, సరళమైన విషాదం కాదు – రెండింటి సమ్మేళనమే ఇక్కడి కథన పరిపక్వత. స్త్రీల చేతిపని ఈ కథల్లో మరో సూక్ష్మ సౌందర్య అభ్యాసం. కుండలు చేసేది ఎక్కువగా పురుషులే అయినా, రంగులు కలపడం, డిజైన్లు వేయడం, పండుగలకు సిద్ధం చేయడం వంటి పనులు స్త్రీల భాగస్వామ్యంతో జరుగుతాయి. కథలో కోడలు అత్తగారి దగ్గర రంగులు కలిపే నిష్పత్తులు నేర్చుకునే సన్నివేశం, ఏ పండగకు ఏ రంగు వాడాలో నిర్ణయించే సూక్ష్మ జ్ఞానం తరతరాలుగా స్త్రీల మధ్య మౌఖికంగా చేరిన విధానాన్ని రికార్డు చేస్తుంది. సూక్ష్మ సౌందర్యశాస్త్ర దృష్టితో చూస్తే, ఇది ఏ కళా పాఠశాలలో నేర్పని, పుస్తకాల్లో రాయని ఒక సౌందర్య విద్య. వంట చేయడం, ఇల్లు అలంకరించడం లాగే ఇదీ ఒక కళాత్మక అభ్యాసంగా గుర్తింపు పొందాలి. ఇక ఇంద్రియాను భవాల విషయానికి వస్తే, సూక్ష్మ సౌందర్యశాస్త్రం చూపుకు మాత్రమే పరిమితం కాదు, అన్ని ఇంద్రియాలనూ కలుపుకుంటుంది. 'కాగుబొత్త' కథ దీనికి ఒక మంచి ఉదాహరణ. ఇందులో మట్టికుండ నీటి రుచి, అందులో వండిన అన్నం వాసన విపులంగా చర్చితమవుతాయి. మట్టికుండ నీళ్ళు చల్లగా ఉండడమే కాదు, ఒక ప్రత్యేకమైన మట్టి వాసన అంటుకుని ఉంటుంది. ఫ్రిజ్ నీరు కేవలం చల్లబరుస్తుంది, కానీ మట్టికుండ నీరు ఒక వ్యక్తిత్వాన్ని, ఒక రుచిని ఇస్తుంది. స్టీలు పాత్రలో వండిన పప్పుకూ, మట్టి చట్టిలో వండిన పప్పుకూ ఉన్న తేడా అనుభవమే. ఈ కథలు శాస్త్రీయ వివరణల్లోకి వెళ్ళవు, బదులుగా జ్ఞాపకాలతో ముడిపడిన సజీవ అనుభవాన్ని చెప్తాయి. అమ్మమ్మ పులుసు రుచి, నాయనమ్మ జాడీ వాసన వ్యక్తిగతం, సజీవం. స్పర్శ మరో కోణం. మట్టిముద్ద చేత పట్టుకుంటే చల్లగా, తడిగా, మెత్తగా ఉంటుంది. ఆరిన తర్వాత గరుకెక్కుతుంది. కొలిమిలో కాలినాక గట్టిగా మారుతుంది. ఈ మూడు స్పర్శల మార్పును కొందమంది రచయితలు విపరీతమైన శ్రద్ధతో రాశారు. ఇంత ఖచ్చితమైన వర్ణనకు ప్రత్యక్ష పరిశీలన లేదా అనుభవం తప్పనిసరి.

**బీసీల సాహిత్య అధ్యయనానికి సూక్ష్మ సౌందర్యశాస్త్రం ఎందుకు అవసరం?:** ఈ దృక్కోణం సాహిత్య విమర్శకు ఒక కొత్త ఆలోచనను ఇస్తుంది . సాధారణంగా వృత్తి కథల్ని ఆర్థిక దోపిడీ, సామాజిక అన్యాయం చట్రంలోనే చూస్తాం. అవి ముఖ్యమే, కానీ సరిపోవు. సూక్ష్మ సౌందర్యశాస్త్రం అడిగే ప్రశ్న వేరు– ఈ మనుషులు తమ శ్రమలో ఏ ఆనందం పొందుతున్నారు? వాళ్ళ పనిలో ఏ కళాత్మక సంతృప్తి ఉంది? ఇలా అడగడం ద్వారా మనం వారిని కేవలం బాధితులుగా కాక, తమ నైపుణ్యంతో గర్వించే, పనిలో అర్థం వెతుక్కునే సంపూర్ణ వ్యక్తులుగా చూడగలుగుతాం. అది వారి మానవత్వాన్ని గౌరవించడమే. పైగా ఈ కోణం సాహిత్యానికి కూడా న్యాయం చేస్తుంది. ఈ రచయితలు కేవలం సామాజిక సందేశం కోసం మాత్రమే రాయలేదు, వాళ్ళు మట్టి వాసనను, రంగుల కలయికను, చక్రం లయను తన్మయత్వంతో వర్ణించారు. ఆ శ్రద్ధను గమనించకుండా కథలను కేవలం సామాజిక దస్తావేజుల్లా చదివితే, వాటి సాహిత్య నైపుణ్యాన్ని తక్కువ అంచనా వేసినట్టే.

సూక్ష్మ సౌందర్యశాస్త్రం చెప్పే పాఠం ఒక్కటే– గొప్పతనం పరిమాణంలో కాదు, పరిశీలనలో ఉంటుంది. చిన్న నీళ్లకుండ వంపులో, దాని రంగులో, దాన్ని మోసే స్త్రీ నడకలో ఒక అందం దాగి ఉంటుంది. దాన్ని చూడడానికి ప్రత్యేకమైన శ్రద్ధ కావాలి. 'వాము' కథలు ఆ శ్రద్ధను మనకు నేర్పిస్తాయి. అవి కుమ్మరి వృత్తిని కేవలం సామాజిక సమస్యగా కాకుండా, ఒక జీవన కళగా చూపిస్తాయి. అంతేకాక, ఆ కళ వెనుక దాగిన శ్రమను, సంక్షోభాన్ని మనకు స్పష్టంగా తెలియజేస్తాయి. ఈ రెండింటి సమతుల్యతే ఈ సంపుటిని విలువైనదిగా మారుస్తుంది. 'వాము' కథలు కుమ్మరి జీవితాన్ని కేవలం సామాజిక వాస్తవికతగా నమోదు చేయడమే కాక, రోజువారీ శ్రమలోని సూక్ష్మ సౌందర్యాన్ని ఒక ప్రత్యేక సాహిత్యానుభవంగా నిర్మిస్తాయి. ఈ సంపుటి ముఖచిత్రం నుండి కథాంతర్గత వస్తువులు, ఇంద్రియ వర్ణనల వరకు ప్రతి అంశం ఈ సౌందర్య నిర్మాణానికి దోహదం చేస్తుంది. తెలుగు విమర్శకు ఈ అధ్యయన పద్ధతి చేసే కొత్త ప్రతిపాదన ఏమిటంటే, బీసీ వృత్తి కథలను కేవలం సామాజిక దోపిడీ కోణంలోనే కాకుండా, 'దైనందిన సౌందర్యశాస్త్ర' దృక్పథంతో చదవడం ద్వారా వాటిలోని లోతైన కళాత్మకతను, మానవీయ కోణాన్ని బయటకు తీసుకురావచ్చు. ఇది విమర్శకుడి పరిధిని విస్తృతం చేస్తుంది, పాఠకుడి అనుభవాన్ని సుసంపన్నం చేస్తుంది. ఇదే దృక్పథం ఇతర కులవృత్తుల సాహిత్యాన్ని, స్త్రీల మౌఖిక సౌందర్య జ్ఞానాన్ని, డిజిటల్ యుగంలో నెమ్మదైన పఠనానుభవాన్ని అర్థం చేసుకోవడానికి కూడా విస్తరించవచ్చు. 'వాము' కేవలం కథల పుస్తకం కాదు– కుమ్మరుల బతుకులోని సూక్ష్మ సౌందర్యాన్ని భావితరాలకు అర్థమయ్యేలా నిక్షిప్తం చేసే ఒక సాంస్కృతిక దస్తావేజు.

(ఆగస్టు 2న భువనగిరిలో
వాము కథా సంకలనం ఆవిష్కరణ సందర్భంగా)

### మేలుకొలుపు

ప్రభాత సూర్యోదయం వేళ
నీటిలో కలువ రెక్కలు విప్పుకున్నట్టుగా
పొగ మంచు తెరలుగా వీడుతున్న వేళ
కోకిల కిలకిల రావాలు సవ్వడి చేస్తున్న వేళ
జలజల రాలే జారువాలు జలపాతంలా
చినుకు తాకిడికి వెదజల్లే మట్టి సువాసన
రైతులు నాగలి పట్టి పొలానికి నడిచే వేళ
ఆరోగ్యాన్ని పెంచే యోగాసనాలు వేస్తున్న వనితలు
కుర్ర కారుకు పిల్లగాలి చెవిలో చెప్పే సందేశంలా
వాకిలి ఊడ్చుతూ ఇంటిముందు అందమైన రంగవల్లులతో
ముచ్చటగా అలంకరిస్తున్న వేళ.
అప్పుడే విరిసిన కుసుమాలను కోస్తున్న వేళ
కోడి కూతలు పసి పాపాయి బోసి నవ్వులు
దేవాలయం నుండి వచ్చే సుప్రభాతాలను వింటూ
నిదుర నుంచి మేల్కొని మా పల్లె అందాలు
కనువిందు చేస్తుంటే మనసంతా ఆనంద పారవశ్య మాయెను

ఆరిశెట్టి రేవతీ గుప్తా
సాలూరు , విజయనగరం జిల్లా ఆంధ్ర ప్రదేశ్
లిఫోన్: 8019127668

### స్నేహం ఒక సంపద

స్నేహానికి ఎల్లలు లేవు
స్నేహానికి పరిమితులు లేవు
స్నేహం ఒక మహా ప్రవాహం
మధుర జ్ఞాపకాలు స్నేహితులు!!
స్నేహం త్యాగాన్ని కోరుతుంది
ఆప్యాయత ప్రేమను కురిపిస్తుంది
స్నేహం సంతృప్తిని కలిగిస్తుంది
అభివృద్ధిని చేకూరుస్తుంది!!

సన్మార్గంలో పయనింపజేస్తుంది
స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం
స్నేహానికన్న మిన్న ఈ లోకాన లేదు!!
స్నేహితులు దినోత్సవం సందర్భంగా..

దేవులపల్లి రమేశ్,
సిద్దిపేట, నంగునూర్
9963701294

### గాయం పతకం లాంటిదే

రాత్రి మాత్రం దిండు తడుస్తుంది.
విరహం అంటే
బయటకు కనిపించని యుద్ధం కదా!
అందరూ మాట్లాడేట ప్పుడు
ఒక మౌనం కూడా ఉంటుంది.
అది అన్నింటి కంటే
బిగ్గరగా వినిపిస్తుంది
అర్థం చేసుకునే వారికి!
దారిలో నేర్చుకున్న
గాయాలే ముఖ్యం.
అవి నిన్ను నువ్వుగా చేస్తాయి.
లేచి నడిస్తే ?
ప్రతి గాయం ఒక పతకం లాంటిదే!
ఇతరులు కలలు కంటున్నప్పుడు
నువు తప్పక నిజం
చేస్తావ్. కన్నీళ్లు ఊరుతున్నప్పుడు
గాయానికి మందు
పంచదార కాదు కదా!

ఏటూరి నాగేంద్రరావు :7416665323

### నీ జాడ ఎక్కడ!

మానవత్వమా
నీ జాడ ఎక్కడ!
వర్గాధిపత్యవు పోరులో పావులన్ని
ఒక్కటిగా చేరి నిన్ను ఒంటరిగా నెట్టేశాయా!
ఆచార సంప్రదాయాల పేరిట
మతం ముసుగులో ఊరవతల
స్మశానంలోకి నెట్టేశారా!
మనిషికి – మనీకి జరిగిన సంఘర్షణలో
మనీ నిన్ను అణిచి వేసిందా?
మదము– మానమునకు జరిగిన యుద్ధంలో..
మద క్రూరత్వానికి నీవు బలి కావలసి వచ్చిందా?
మనము–అహంకి జరిగిన తగువులాటలో
అహం నీ మీద పెత్తనం చేస్తుందా?
అందుకేనేమో
మానవత్వం నీ జాడ ఎక్కడ అని వెతక వలసి వస్తుంది!
మతము కన్నా మానవత్వం గొప్పదా?
మానవత్వం కన్నా మతం గొప్పదా అని ప్రశ్నించక
మతము నిన్ను /నన్ను నాది గొప్ప అంటే నాది గొప్పని మనుషుల
మధ్య అలజడి సృష్టిస్తుంది..
మానవత్వం సమాజం,
సాటి వ్యక్తి అవసరతల కోసం, పరితపించేలా,
ఆలోచించేలా నిరంతరం ప్రేరేపిస్తుంది..
అందుకేనేమో
మతము కంటే మానవత్వమే గొప్పది!!



గంజి.కుమార్ రాజా
పరిశోధక విద్యార్థి
యోగి వేమన విశ్వవిద్యాలయం
7730896943.

సాహిత్య లహరి
SAHITYA LAHARI
ఆదివారం 2-08-2026





కొన్ని ప్రయాణాలు ఒక తేదీని చూసుకొని మొదలవ్వవు. అవి మనసులోనే చాలాకాలం ముందే ప్రారంభమవుతాయేమో. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠానికి వెళ్లాలనే నా ప్రయాణం కూడా అలాంటిదే. చిన్నప్పటి నుండీ ఆ పేరు వినబడినప్పుడల్లా, నా ఊహల్లో ఆ రాయలసీమ గ్రామం రూపుదిద్దుకునేది. కాలాన్ని తన ఒడిలో దాచుకున్న నేల, మౌనాన్ని భాషగా మార్చుకున్న చెట్లు, మహాయోగి అడుగుల జ్ఞాపకాన్ని ఇంకా దాచుకున్న వీధులు...అన్నీ నా ఊహలో నెమ్మదిగా ఒక చిత్రంలా విప్పారేవి.

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గురించి ఎంత చదివితే అంత కొత్త ఆసక్తి కలిగేది. ఆయన కాలజ్ఞానం ప్రజల విశ్వాసంలో ఒక ప్రవాహంలా నేటికీ కొనసాగుతూనే ఉంది. ఆయన తాత్త్వికత కాలాన్ని దాటి, మనిషి అంతరంగంతో సంభాషిస్తుంది. నాకు ఆయన పద్యాలు చదివినప్పుడల్లా జీవితానుభవంతో వెలిగిన దీపాల్లా అనిపించేవి. ఆ వెలుగు పుట్టిన ప్రదేశాన్ని ఒకసారి స్వయంగా చూడాలనే కోరిక మనసులో ఎప్పటినుండో నిశ్శబ్దంగా వేర్లు వేసుకుంది. ఆ కోరికకు రూపం ఇచ్చిన వారు యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ తప్పెట రామ ప్రసాదరెడ్డి గారు. ఆయన భగవాన్ కాశిరెడ్డి నాయనగారికి పరమభక్తులు. ఆయన కారులో ఎప్పుడూ కాశిరెడ్డి నాయనగారి ఫోటో ఉంటుంది. ఆ చిత్రపటానికి దండం పెట్టుకునే ఏ పనైనా ప్రారంభిస్తారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో ఒక పిహెచ్డి మౌఖిక పరీక్షకు విషయ నిపుణులుగా వెళ్లాను. అది 25.7.2026వ తేది. మధ్యాహ్నానికి వైవా పూర్తి అయింది. తర్వాత అందరి ఫ్యాకల్టీని కలిసినట్లే డా.రామప్రసాదరెడ్డి గారిని కూడా కలిశాను. అంతకు ముందు ఒకసారి ఆ విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు ఆయనే స్వయంగా గండి శ్రీ ఆంజనేయ స్వామి క్షేత్రాన్ని దర్శింపచేశారు. కడప జిల్లాలోని అత్యంత ప్రసిద్ధ శ్రీ ఆంజనేయ స్వామి క్షేత్రం గండి క్షేత్రం (గండి ఆలయం). ఇది కడప నగరానికి సుమారు 55 కిలోమీటర్ల దూరంలో, పాపఘ్ని నది ఒడ్డున శేషాచలం కొండల మధ్య ఉంది. స్వయంగా శ్రీరామచంద్రుడు తన బాణంతో బండపై ఆంజనేయుడి రూపాన్ని చెక్కాడని ఇక్కడి పురాణ విశ్వాసం. తర్వాత ఇడుపులపాయ తీసుకువెళ్లి వైయస్సార్ ఘాట్ చూపించారు. అవన్నీ గుర్తు చేసుకుంటున్న మాటల సందర్భంలో "బ్రహ్మంగారి మఠానికి వెళ్దాం" అని ఆయన చెప్పగానే, చాలా కాలంగా ఎదురుచూస్తున్న పిలుపే ఆయన నోట్లో నుండి వచ్చినట్లుగా అనిపించింది. ఆ ఆహ్వానం వినగానే, దానికంటే ముందే నా మనసు కందిమల్లాయపాలెం చేరుకుంది. ప్రముఖ సినీనటుడు ఎన్.టి.రామారావు గారు నటించిన చలనచిత్రంలోని అనేక దృశ్యాలు కళ్ళముందు కదిలాయి. యాత్ర మొదలయ్యేలోపే నా ఆలోచనలు ఆ నేలపై ఆనందంతో తిరుగుతున్నట్లనిపించింది. ఎన్నో శతాబ్దాల క్రితం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి చూసిన ఆకాశమే ఇప్పటికీ ఆ గ్రామం మీద నీలి చీరలా పరుచుకొని ఉంటుందా? ఆయన నడిచిన దారుల మీద ఇప్పటికీ ఉదయపు గాలి అదే మృదుత్వంతో వీస్తుందా? ఆయన ధ్యానించిన నిశ్శబ్దాన్ని ఆ గ్రామం ఇంకా తన హృదయంలో అలాగే దాచుకుందా? అలాంటి ఎన్నో ప్రశ్నలు నా మనసులో అలలు అలలుగా ఎగసిపడుతుండగా యాత్రకు సమయం ఆసన్నమైంది. ఆ అనుభూతిని నా కళ్లతో చూడడానికి, నా అడుగులతో తాకడానికి, నా మనసుతో ఆస్వాదించడానికి నేను బయలుదేరాను.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి




## మఠం సందర్శన ఓ యాత్రానుభవం



పోలేరమ్మ దేవాలయం ముందు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, శ్రీ చంద్రశేఖర్, ఖలందర్

కడప నగరాన్ని దాటిన కొద్దిసేపటికే రాయలసీమ తన సహజ స్వరూపాన్ని మెల్లగా విప్పుకుని చెప్పాలనిపించింది. దూరంగా గోధుమరంగు కొండలు, వాటి పాదాల వద్ద పచ్చని పొలాలు, నేలమీద మట్టి నలుపు, కుంకుమ రంగు, ఎరుపులలో కలిసి ఒక కొత్త మేళవింపు మతో కనిపిస్తుంది. ఎక్కడికక్కడ తలెత్తినట్లుండే రకరకాల చెట్లు... రోడ్డుకిరువైపులా ఉండే పొలాల్లో పసుపు, టొమాటోలు, కొన్ని చేలల్లో అరటితోటలు...మరికొన్ని చేలల్లో జొన్న పంటల.. రకరకాల కూరగాయలులతో చాలా వరకు చేలు పచ్చగా కనిపించాయి. కొన్నిచోట్ల ఎండిపోయి, ఏ పంటా లేక బీడు వారిపోయాయి. మొత్తం మీద ఈ నేల ఎన్నో శతాబ్దాల చరిత్రను తనలో దాచుకొని ప్రశాంతంగా శ్వాసిస్తున్నట్టుగా అనిపించింది. డా.రామ ప్రసాద రెడ్డి గారు కారును నెమ్మదిగా నడుపుతున్నారు. కారులో శ్రీ వేంకటేశ్వర స్వామి సంకీర్తనలు మృదువుగా వినిపిస్తున్నాయి. ఆ సంగీతం, ఆ ప్రకృతి, మా సంభాషణా ఆ మూడూ కలిసి యాత్రను ఒక ఆధ్యాత్మిక అనుభవంగా మలిచాయి. ఆయన మధ్య మధ్యలో బ్రహ్మంగారి మఠం దగ్గర జరగాల్సిన ప్రొటోకాల్ దర్శనం ఏర్పాట్ల కోసం మాట్లాడేవారు. వాళ్ళబ్బాయి ప్రసిద్ధ డాక్టర్. రోహిత్ రెడ్డి. ఆయన మెడికవర్ హాస్పిటల్ లో కొన్నాళ్లు పనిచేసి సొంతంగా ఒక మెడికల్ ఎమర్జెన్సీ కన్సల్టెన్సీ పెట్టారట. హైదరాబాదులోనే ఉంటారు. ఎప్పుడైనా కావాలంటే ఆయన అందుబాటులో ఉంటారని చెప్పారు. ఆయన గురించి మాట్లాడుకుంటున్న సమయంలోనే వాళ్ళ నాన్న గారికి ఆయన ఫోన్ చేసి ఆత్మీయంగా కాసేపు మాట్లాడం విచిత్రమనిపించింది. ఆయనకు నన్ను కూడా పరిచయం చేసి నాతో కూడా మాట్లాడించారు. ప్రయాణంలో అలా కిటికీ బయటకు చూస్తుంటే నా ఆలోచనలు పదిహేడవ శతాబ్దం వైపు మళ్లాయి. ఇదే రాయలసీమ... ఇదే ఆకాశం... ఇదే గాలి... ఇదే నేల. ఈ దారుల్లోనే ఎప్పుడో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి సంచరించి ఉంటారు. ఈ కొండలను చూసే ఆయన దృష్టిలో కాలం ఎలా కనిపించి ఉంటుందో! ఈ నేలపై నిలబడి భవిష్యత్తు తరాల గురించి ఆయన ఎలా ఆలోచించి ఉంటారో అనే ప్రశ్నలు నాలో మౌనంగా కొత్త కొత్త దృశ్యాలతో మెదులుతున్నాయి.

శ్రీ వీరబ్రహ్మంగారు జీవించిన కాలం రాయలసీమ రాజకీయంగా గోల్కొండ కుతుబ్‌షాహీ పాలన ప్రభావంలో ఉన్న సమయం. ఆ కాలంలోనే ఆయన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని గౌరవించిన నవాబు కందిమల్లాయపాలెం మఠానికి డెబ్బై ఎకరాల భూమిని ఇనాంగా ఇచ్చాడని మఠ చరిత్ర చెబుతోంది. అది ఒక వ్యక్తికి ఇచ్చిన గౌరవం అనుకోకూడదు. జ్ఞానానికి, తపస్సుకు, మానవతకు సమాజం అర్పించిన నమస్కారంగా నాకు అనిపించింది.

శ్రీ వీర బ్రహ్మంగారు వడ్రంగి వృత్తికి చెందిన కుటుంబంలో జన్మించారు. అయినప్పటికీ ఆయన జీవితంలో కనిపించేది కులం కాదు, జ్ఞానం; వృత్తి కాదు, వివేకం; వ్యక్తిగత మహిమ కాదు, సమస్త మానవాళిని ఆవరించిన ఆధ్యాత్మిక దృష్టి. అందుకే అన్ని వర్గాల వారూ ఆయనకు శిష్యులయ్యారు. ఆయన ఆశ్రమంలో జన్మ కంటే గుణానికి, వంశం కంటే విలువలకు, బాహ్య గుర్తింపుకంటే అంతరంగ వికాసానికే ప్రాధాన్యం లభించిందని నేను గతంలో చదివిన విషయాలు ఒక్కొక్కటిగా నా జ్ఞాపకాల్లో మెదులుతున్నాయి.

కందిమల్లయ్యపాలెం మరింత చేరువవుతున్న కొద్దీ, నేను ఒక గ్రామానికి వెళు తున్నాననే భావన కంటే, తెలుగు చరిత్రలో ఇప్పటికీ సజీవంగా నిలిచి ఉన్న ఒక మహనీయుని అడుగుజాడల్లో నడవబోతున్నాననే ఆనందమే ఎక్కువగా అనిపించింది. అక్కడ ప్రతి రాయి ఒక కథ చెబుతుందేమో... ప్రతి చెట్టు ఒక జ్ఞాపకాన్ని దాచుకుందేమో... ప్రతి గాలి వీచికలో ఆయన తాత్త్వికత ప్రతిధ్వనిస్తుందేమో... అనే మధురమైన ఎదురుచూపులతో నా మనసు ముందే బ్రహ్మంగారి మఠ ప్రాంగణంలో సంచరిస్తోంది. శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామివారి వలన ప్రసిద్ధి పొందుట చేత కందిమల్లయ్యపల్లె తర్వాతి కాలములో బ్రహ్మంగారిమఠంగా ప్రసిద్ధి చెందింది. ఆయన అసలు పేరు వీరప్పయాచార్యులు. కీ.శ.1608లో జన్మించిన ఆయన క్రీ.శ.1693వ సంవత్సరంలో సజీవ సమాధి అయ్యారు.

కొద్దిసేపటికే కందిమల్లాయపాలెం మమ్మల్ని ఆహ్వానించింది. అప్పటికే చంద్రశేఖర్ గారు... శ్రీ వీర బ్రహ్మంగారి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాకోసం ఎదురుచూస్తున్నాడు. ఆయన కూడా మా కారు ఎక్కి కూర్చున్నాడు. గ్రామంలోకి అడుగుపెట్టగానే ఒక విచిత్రమైన ప్రశాంతత మనసును తాకింది. అది కాలం నెమ్మదిగా మాట్లాడుతున్న స్వరంలా తాకింది. ఆ వీధుల్లో నడుస్తుంటే హడావుడి కనిపించలేదు. ప్రతి ఇల్లు, ప్రతి చెట్టు, ప్రతి రచ్చబండ తమకు తెలిసిన ఒక చరిత్రను లోపల దాచుకొని ఏదో ఓ ఆధ్యాత్మిక గర్వంతో నిలబడి ఉన్నట్టుగా అనిపించింది.

శ్రీ వీరబ్రహ్మంగారు కూర్చున్న రచ్చబండ, ఆ పక్కనే ఒక శిలా శాసనం ఉన్నాయి. రచ్చబండను పవిత్రంగా తాగాను. ఒక మహిమాన్వితుడు కూర్చున్న నేలను తాకుతున్నాననే ఒక విచిత్రమైన భావన. నేను స్థలాన్ని ఎంతో పవిత్రంగా భావించాను. ఆ స్థలాన్ని నమస్కరించుకున్నాను. నేను కూడా అక్కడ కూర్చున్నాను. నాతో పాటు డా.రాంప్రసాద్ రెడ్డి గారు కూడా కూర్చున్నారు. ఎన్టీ రామారావు సినిమాలో చాలా విశాలమైన వేదికగా చూపిస్తారు. కానీ వాస్తవానికి ఆ రచ్చబండ ఉన్న ప్రాంతం చాలా ఇరుకుగా ఉంది. అక్కడి నుంచి స్వామివారు నివసించిన ఇంటి వైపు నడిచాం. బయటికి చూస్తే అది ఒక








సాధారణ ఇల్లులానే కనిపిస్తుంది. అయితే గడప దాటిన క్షణం నుంచి ఆ సాధారణత్వమే అసాధారణంగా అనిపిస్తుంది. ఎన్నో శతాబ్దాల క్రితం ఆ ప్రాంగణంలో నడిచిన అడుగుల ప్రతిధ్వని ఇప్పటికీ అక్కడి నిశ్శబ్దంలో వినిపిస్తున్నట్టుగా అనిపించింది.

శ్రీవీర బ్రహ్మంగారే స్వయంగా తయారు చేసుకున్న ద్వారా బంధాలు, దానికి చెక్కిన అందమైన శిల్పాలు లాంటి నిర్మాణాలు ఎంతో ఆకర్షణీంగా అనిపించాయి. అవి పునరుద్ధరించే పనుల్లో భాగంగా ఫోటోలు, కొలతలు తీసుకుంటూ ఆ శిథిలమైపోతున్న గోడలను తొలగిస్తున్నారు. లోనికి ఎవరినీ వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. చంద్రశేఖర్ గారు ప్రత్యేకమైన అనుమతి తీసుకుని ఉండడం వలన మమ్మల్ని లోనికి వెళ్ళనిచ్చారు. బ్రహ్మంగారి జీవించిన ఇంటి పక్కనే ఒక నుయ్యి ఉంది. అది బ్రహ్మంగారు స్వయంగా ఒక రాత్రిలో దుప్పి కొమ్ముతో తవ్వారట. ఆనాటి ఆధిపత్య కులాలు బ్రహ్మంగారి కూడా మంచి నీళ్లు ఇవ్వడానికి నిరాకరించినప్పుడు తాను ఆ భావి తగ్గుకున్నట్లుగా ప్రజలు చెబుతారు. ఆయన స్వయంగా తవ్విన నుయ్యి వద్ద కొద్దిసేపు నిలబడ్డాను. ఆ నుయ్యిలోని నీటిని మాత్రమే కాదు, కాలాన్ని కూడా లోతుగా తవ్వి బయటకు తీసిన మహనీయుని జీవితం నా మనసులో మెదిలింది. ఆ బావి రాళ్లను చూస్తుంటే, వాటిపై కాలం తన ముద్రను వేసినా, వాటి జ్ఞాపకాలను మాత్రం చెరపలేకపోయిందనిపించింది.

అక్కడ కొన్ని ఫోటోలు తీసుకుని వదిలి రాలేక రాలేక అక్కడ నుండి బయలుదేరాం. తర్వాత శ్రీవీరబ్రహ్మంగారు సజీవ సమాధి అయిన స్థలం, అక్కడే నిర్మించిన దేవాలయం దర్శించాం. మాకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు చంద్రశేఖర్. అందువల్ల త్వరగా దర్శనం అయింది. మఠాధిపతులు ప్రత్యేక పూజలు చేయించారు. శేషవస్త్రాన్ని, ప్రత్యేక పూజలు చేసిన పూలమాల ప్రసాదాలను మాకు బహుకరించారు. అక్కడ పూజారులు అందరూ ఆ వంశానికి చెందిన వారే కావడం విశేషం అని డా.రాంప్రసాద్ రెడ్డి గారు ఆ విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పారు. వారు చదువుతున్న శ్లోకాలు, చేస్తున్న పూజా విధానం బ్రాహ్మణులకు ఏమాత్రం తీసుకుపోనట్లుగా అనిపించింది. స్పష్టమైన ఉచ్చారణ, సంప్రదాయబద్ధమైన ఆచారాలతో ఆ పూజా విధానాలు కొనసాగుతున్నాయి. మేము వెళ్ళింది తొలి ఏకాదశి రోజు కావడంతో భక్తుల సంఖ్య కూడా విశేషంగానే ఉంది. మండపంలో భజన కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. మఠాధిపతి నివసించే గృహాన్ని సందర్శించాం. మఠాధిపతి వారి శ్రీమతి గారిని కలిసాం.

మఠంలోని పూజారులు, నిర్వాహకులు ఎంతో ఆప్యాయంగా మాతో మాట్లాడారు. మా కోసం శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞానం వ్రాతప్రతులను చూపించారు. స్వామివారి జీవిత విశేషాలను వివరించడం ప్రారంభించిన వెంటనే కాలం వెనక్కి నడుస్తున్న అనుభూతి కలిగింది. వారు చెప్పిన ప్రతి సంఘటనా, స్థానిక చరిత్రతో, ప్రజల జ్ఞాపకాలతో ముడిపడి ఉంది. పదిహేడవ శతాబ్దపు రాయలసీమ సామాజిక జీవితం, ఆ కాలంలో ప్రజల విశ్వాసాలు, స్వామివారి సంచారాలు, శిష్య పరంపర అన్నింటినీ వారు ఎంతో సహజంగా వివరిస్తున్నారు. పుస్తకాల్లో చదివిన విషయాలు అక్కడ మనుషుల మాటల్లో వినిపిస్తుంటే వాటికి మరో జీవం వచ్చినట్టుగా అనిపించింది. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారు సజీవ సమాధి అయిన ప్రాంతంలో నిలబడితే ఏదో నాకు ఒక వైబ్రేషన్ అనిపించినట్లు అనిపించింది. ఒకప్పుడు శ్రీరాఘవేంద్ర స్వామి దేవాలయానికి వెళ్ళినప్పుడు ఎలాంటి అనుభూతికి గురి అయ్యానో, మరలా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నప్పుడు అలా అనిపించింది. ఆయన సమాధిపై శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి రూపాన్ని విగ్రహంగా పెట్టారు. దాని ఎదురుగా వారి భార్య పిల్లలు జీవ సమాధి అయిన స్థలాలుగా పూజారి వివరించారు. బయటకు వచ్చిన తర్వాత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారు సజీవ సమాధి అయ్యే ముందు నిలబడి అందరికీ బోధనలు చేసిన స్థలం దగ్గర వారి పాదముద్రికలు ఉన్నాయి. వాటిని ఆ చరిత్రను వివరిస్తూ అక్కడ ఒక పూజారి కూడా ఉన్నారు. అక్కడ ఉన్న అనేక గుడ్లలో పూజారులు ఉండడం ప్రతిచోట నామార్చన చేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం కొనసాగుతున్నాయి. శ్రీ వీరబ్రహ్మంగారి దేవాలయం పక్కనే వారి మనవరాలు ఈశ్వరి దేవి అమ్మవారి దేవాలయం ఉంది. అంటే ఆమె సమాధి ఉంది. అక్కడ కూడా పూజలు జరుగుతున్నాయి.

మఠం ఆవరణలోకి ప్రవేశించగానే అక్కడి వాతావరణం మనసును మరో లోకంలోకి తీసుకెళ్లింది. ఎక్కడా కృత్రిమ ఆర్భాటం లేదు. భక్తి తన సహజ రూపంలో కనిపిస్తోంది. శతాబ్దాలుగా భక్తుల పాదస్పర్శతో పవిత్రమైన ఆ నేల, గాలిలో పరచుకున్న ధూప, దీప, సుగంధం, ఘంటారావాల మృదునాదం, నిశ్శబ్దంగా ధ్యానంలో మునిగిపోయిన భక్తులు...ఇవన్నీ కలసి ఆ క్షేత్రానికి ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక గంభీరతను ప్రసాదిస్తున్నాయి.

అక్కడి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ చంద్రశేఖర్ గారు ఎంతో ఆత్మీయంగా మాకు అన్నీ దగ్గరుండి చూపించారు. ఆలయ మర్యాదల ప్రకారం దర్శనం ఏర్పాటుచేశారు. మఠంలోని ప్రధాన ప్రదేశాలను చూపిస్తూ, ఒక్కో స్థలానికి సంబంధించిన చారిత్రక విశేషాలను ఎంతో ఓర్పుతో వివరించారు. ఆయన మాటల్లో భక్తి ఉంది; ఆ వివరణలో అధ్యయనం ఉంది; ప్రవర్తనలో ఆ సంప్రదాయం పట్ల గౌరవం ఉంది.

మా సంభాషణ క్రమంగా వీరబ్రహ్మేంద్ర స్వామివారి జీవితంపైకి మళ్లింది. మఠాధిపతులు, పూజారులు చెప్పిన ప్రతి విషయం నా మనసులో చదివిన చరిత్రతో కలిసిపోతోంది. వారు స్వామివారిని మహిమలతో మాత్రమే కాదు, సమాజాన్ని లోతుగా అర్థం చేసుకున్న మహనీయునిగా పరిచయం చేశారు. ఆత్మజ్ఞానం గురించి బోధిస్తూ, మనిషి జీవన విలువలను ఆచరణలో చూపించిన యోగిగా ఆయనను వర్ణించారు.

స్వామివారి శిష్య పరంపర గురించి వారు చెప్పినప్పుడు నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. కులం, వృత్తి, సామాజిక స్థితి వంటి భేదాలకు అతీతంగా జ్ఞానాన్వేషణతో వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన ఆశ్రమ ద్వారం తెరిచి ఉండేదని వారు వివరించారు. సిద్ధయ్య వంటి మహాభక్తుల ప్రస్తావన వచ్చినప్పుడు ఆ సంప్రదాయం ఎంత విశాలమైందో మరింత స్పష్టమైంది. గురువు బోధన ఒక వ్యక్తితో ముగియకుండా, శిష్యుల జీవితాల ద్వారా సమాజంలో ఎలా విస్తరించిందో వారి వివరణలో అర్థమైంది.


శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వారు సజీవ సమాధి గురించి వివరిస్తూ పూజారిగారు చెప్పిన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో మారు మ్రోగుతూనే ఉన్నాయి. "మహనీయుల జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే వారు వదిలిన విలువలను చూడాలి" అని ఆయన ఎంతో ప్రశాంతంగా అన్నారు. ఆ ఒక్క వాక్యం ఆ యాత్రకు ఒక కొత్త అర్థాన్ని ఇచ్చింది. సమాధి అనేది ఒక ముగింపు కాదు; తరతరాలకు స్ఫూర్తినిచ్చే జీవన సందేశానికి నిలయమని ఆ క్షణంలో నాకు అనిపించింది.

మఠం చుట్టూ మరోసారి నెమ్మదిగా నడిచాను. ప్రాచీన వృక్షాలు తమ నీడలో ఎన్నో తరాల భక్తులను చూసి ఉంటాయి. ఆ ప్రాంగణంలోని ప్రతి రాయి వేలాది మంది నమస్కారాలను మౌనంగా స్వీకరించి ఉంటుంది. గాలిలో కలిసిన వేదఘోషలు, భక్తుల ప్రార్థనలు, పక్షుల కిలకిలారావాలు అన్నీ కలిసి ఆ క్షేత్రాన్ని ఒక జీవంతమైన ఆధ్యాత్మిక స్మృతిగా నిలబెడుతున్నాయి.

అక్కడి నుంచి తిరిగి అడుగులు వేస్తున్నప్పుడు ఒక తృప్తి మనసంతా నింపుకుంది. ఎన్నాళ్లుగానో మనసులో నిలిచిన ఒక కోరిక నెరవేరింది. చదివిన చరిత్రకు ఆ రోజు ఒక రూపం కనిపించింది. విన్న కథలకు ఒక నేల దొరికింది. పుస్తకాలలో పరిచయమైన శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, కందిమల్లయ్యపాలెం నేలపై నడుస్తూ నా మనసుకు మరింత చేరువయ్యారు. అక్కడ తినడానికి రకరకాల సత్రాలు ఉన్నాయి. నిత్య అన్నదానాలు జరుగుతున్నాయి. శిష్యులు సిద్దయ్య, కక్కయ్య నాకు సంబంధించిన విశేషాలు కూడా చారిత్రక ప్రాంతాలలో కనిపిస్తున్నాయి. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారు శ్రీ విష్ణుమూర్తి అవతారంగా చెప్తారు. అక్కడ ఆ దేవాలయాల సమూహంలో విఘ్నేశ్వరుడు, నంది విగ్రహాలు కూడా కనిపించడం విశేషం. ఆ ప్రాంగణం లోనే తిరుమల తిరుపతి దేవస్థానం వారు భక్తులకు సౌకర్యాలను అందించే విధంగా బిల్డింగ్ కూడా కట్టించారు. ఆ ప్రాంతం అంతా ఒక ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. అక్కడ భక్తి పేరుతో వ్యాపారం జరుగుతున్న ఫీలింగ్ కనిపించలేదు. ఆ ప్రాంతానికి కొంచెం దూరంలో ఒక రిజర్వాయర్ ఉంది. దానికి సాగర్ వీర బ్రహ్మం సాగర్ అని పేరు పెట్టారు. బ్రహ్మంగారిమఠం మండలంలో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రముఖ జలాశయమే వీరబ్రహ్మం సాగర్ (బ్రహ్మంసాగర్ రిజర్వాయర్). ప్రసిద్ధ తత్వవేత్త, కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పేరు మీద ఈ జలాశయానికి నామకరణం చేశారు. అది ఎన్టి రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రారంభించారట. తర్వాత దాన్ని వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి ఉన్న కాలంలో పూర్తి చేశారని చెప్తున్నారు. రిజర్వాయర్ వల్ల వేసవి కాలంలో కూడా ఆ ప్రాంతంలో నీళ్ల సమస్య లేదని చాలామంది భావిస్తున్నారు. ఆ విధంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠాన్ని దర్శించుకున్నాం. కందిమల్లాయ్యపాలెంతో పాటు బనగానపల్లి, యాగంటి మొదలైన పుణ్యక్షేత్రాలతో వీరబ్రహ్మేంద్రస్వామి వారి చరిత్రకు అనుబంధం ఉంది అని అక్కడికి వెళ్లిన తర్వాత తెలిసింది. నేను, మా కుటుంబం, మా విద్యార్థులతో కలిసి గతంలో యాగంటికి చాలా సార్లు వెళ్ళాను. యాగంటిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువైయున్న ఒక అద్భుతమైన పర్వత గుహ ఉంటుంది. దానిలో వీరబ్రహ్మేంద్రస్వామి వారు తపస్సు చేసుకుంటూ కాలజ్ఞానాన్ని రాసారని చెప్తారు. వాటిని కూడా పూజారులు ప్రస్తావించారు. మొత్తం మీద ఎన్నాళ్ళగానో చూడాలనుకున్న ఒక చారిత్రక పురుషుని, ఒక ఆధ్యాత్మికవేత్త, కాలజ్ఞాని, గొప్ప మతసామరస్యవాది పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠాన్ని చూడడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. రాయలసీమ ప్రాంతాన్ని చాలామంది కరువు ప్రాంతంగా మాత్రమే గుర్తిస్తుంటారు. కానీ, నాకు అది ఒక గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా అనిపిస్తుంది. అనేకమంది యోగులు, ఆధ్యాత్మిక వేత్తలు, పురాణ పురుషులు, పుణ్యాత్ములు, దైవాలు కొలువైన స్థలంగా అనిపిస్తుంది. చక్కటి ఒక పుణ్యక్షేత్రాన్ని చూడాలని తీసుకొనివెళ్ళిన ఆచార్య తప్పెట రామ ప్రసాద రెడ్డి గారికి, అన్ని దగ్గరుండి చూపించిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గారికి, చక్కని ఫోటోలు తీసిన ఒకప్పటి మా సెంట్రల్ యూనివర్సిటీ ఎం.ఏ. విద్యార్థి, ప్రస్తుతం యోగివేమన విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ స్కాలర్ ఖలందర్, అలాగే మరొక రీసెర్చ్ స్కాలర్... మాకు మంచి ఫోటోలు తీశారు. వీళ్ళందరికీ నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గారు స్వయంగా తవ్వు తవ్వుకున్న మంచినీటి బావి దగ్గర ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, శ్రీ చంద్రశేఖర్



- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్, ఫోన్: 9989628049

# సాహిత్య లహరి
SAHITYA LAHARI

ఆదివారం 2-08-2026



**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064


## ఆత్మీయ అక్షరాల జీవిత కావ్యం

# తొవ్వ నేర్పిన పాఠం

**"కవిత్వానికి, కన్నీటికి ఎప్పటి బంధమో ఏమో... కన్నీరు కార్చిన ప్రతిసారి కవిత్వం జాలువారుతుంది." ఈ మాటలు కవిత్వపు మూలాలను, దానిలోని భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరిస్తాయి. డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ తన 'తొవ్వ నేర్పిన పాఠం' కవితా సంపుటి ద్వారా కవిత్వం అంటే కేవలం పాండిత్య ప్రదర్శన కాదని, అది కవి ఆత్మను ప్రతిబింబించే నిరంతర ప్రక్రియ అని నిరూపించారు. ఆయన కవిత్వం సమాజాన్ని, మనిషిని, మనిషిలోని సంఘర్షణను నిశితంగా పరిశీలిస్తుంది. ఆదినారాయణ కవిత్వంలో దళిత చైతన్యం ప్రధానంగా కనిపిస్తుంది. శతాబ్దాలుగా దళితులు అనుభవించిన అవమానాలు, బహిష్కరణలు, సామాజిక వివక్షత ఆయన అక్షరాల్లో నిలువుటద్దంలా కనిపిస్తాయి. "నీలాకాశపు ఎడారి" వంటి ప్రతీకల ద్వారా దళితుల నిరాశను, వారు ఎదుర్కొనే అమానవీయ పరిస్థితులను ఆయన కవిత్వీకరించారు.**

**"దండెం/ ప్రతి ఇంటి దుస్తుదీపం/ దండెం మీద/ అమ్మ ఆరేసిన బట్టలు చూస్తుంటే/ కరెంటు తీగ మీద వరుసగా కూర్చున్న చిలుకల్లా/ ఎంత అందంగా ఒదిగిపోతాయో!/ దండెంపై బట్టలన్నింటిని/ అశ్వేతాంబర, పితాంబరాలు సైతం/ అమ్మ హృదయంలా/ తళ తళ మెరుస్తాయి".**

కవి ఈ కవితలో దండెం అనే ఒక సాధారణ వస్తువును ఆధారంగా చేసుకుని అమ్మ ప్రేమను ఎంతో సులభంగా, అందంగా వర్ణించారు. ఇళ్లల్లో బట్టలు ఆరేసే దండెం అందరి ఇళ్లకు వెలుగునిచ్చే ఒక దీపం లాంటిది. దండెం మీద అమ్మ వరుసగా ఆరేసిన బట్టలు చూస్తుంటే, కరెంటు తీగ పైన ప్రశాంతంగా కూర్చున్న రామచిలుకలు గుర్తుకొస్తాయి. ఆ దండెం మీద ఉన్నవి మామూలు బట్టలైనా లేదా ఖరీదైన పట్టు వస్త్రాలైనా సరే, వాటన్నింటి కంటే ఎక్కువగా అమ్మ స్వచ్ఛమైన మనసే అక్కడ తళతళ మెరుస్తూ కనిపిస్తుంది. రోజూ మనం చూసే ఒక చిన్న విషయాన్ని అమ్మ ప్రేమాస్పదమైన మనసుకు ముడిపెట్టి చెప్పడమే ఈ కవితలోని అసలైన అందం.

కవిగా ఆదినారాయణ కుటుంబ బంధాలను, మాతృమూర్తి త్యాగాలను ఎంతో సున్నితంగా వర్ణించారు. తన తల్లిని ఒక ప్రేమమూర్తిగా, శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా ఆయన చిత్రించారు. తెలంగాణ పలుకుబడిని జోడించి, అమ్మలోని ఆత్మీయతను, గృహస్థ జీవితంలోని అందాన్ని, బాంధవ్యాల గొప్పతనాన్ని ఆయన కవితలు పాఠకుడికి కళ్ళకు కట్టినట్లు చూపుతాయి. ఇల్లు అంటే కేవలం గోడల కట్టడం కాదని, అది జ్ఞాపకాల, అనురాగాల నిలయమని ఆయన కవితలు గుర్తు చేస్తాయి.

ఆదినారాయణ కవిత్వంలో అద్భుతమైన తాత్వికత ఉంది. 'డిసెంబర్ 31' కవిత ద్వారా కాలం, జీవిత గమనం, ఆశావాదం గురించి ఆయన చేసిన విశ్లేషణ అత్యంత లోతైనది. కాలం మనిషి ఆయుష్షును తగ్గించే మెట్టు మాత్రమే అని, మనిషి జ్ఞాపకాలకూ, భవిష్యత్ ఆశలకూ మధ్య చేసే పోరాటాన్ని ఈ కింది కవితలో ఆయన అద్భుతంగా ఆవిష్కరించారు.

**"డిసెంబర్ 31/ జీవన గమనానికి/ అంచలంచెల/ ఆయుష్షు దించే మెట్టే తప్పా/ పెంచే మెట్టు కాదు./ సాయంత్రంకల్లా/ ఏదో జయించొచ్చామనే ఫీలింగ్/ ప్రతి ఇంట్లో, ప్రతి బస్తీలో కేక్ కటింగ్/ డీ.జెలు, పబ్బులు పార్టీలు/ బీర్లు బార్లలో తెల్లవార్లు/ ప్రభుత్వాలు వాటికి ప్రత్యేక పర్మిషన్లు"**


అలాగే, పేదరికం కారణంగా రోగం వస్తేనే దొరికే పౌష్టికాహారం గురించి రాసిన కవిత, జీవితంలోని విషాదకరమైన 'ఐరనీ'ని ఎత్తిచూపుతుంది. సాధారణమైన విషయాల్లోని అసాధారణ అర్థాన్ని వెలికితీయడం కవి ప్రత్యేకతని తెలుపుంది

**"పాలు, పండ్లు, టిఫిన్లు మా ఇంటికి/ అతిథులయ్యాయంటే/ రోగం మా ఒంట్లె జేరినట్లు లెక్క/ రోజుతినే బువ్వకు సెలవిచ్చి/ ఇన్ని రకాల తిండి దొరుకుతుందంటే /జరాన్ని ఎందుకు కోరుకోం మరి/ జరమొస్తనే గద దొరికేది మాకివ్వన్ని/ ఇంక నాల్రోజుల ఇట్లనే ఉంటె/బాగుండు అనిపించేది".**

ఈ కవితా సంపుటి పేరుకు తగ్గట్టే, 'తొవ్వ నేర్పిన పాఠం' కవిత అత్యంత స్ఫూర్తిదాయకమైనది. ఒక దళితుడు చదువు కోసం, సామాజిక గుర్తింపు కోసం చేసే ప్రయాణం, ఎదుర్కొనే అవమానాలు, సాధించే విజయాలు ఇందులో ప్రతిబింబిస్తాయి. "అందరు ఆ తొవ్వలో ముళ్ళుంటాయని చెప్పులు తొడుక్కొని నడిస్తే, నేను అక్షరాలు తొడిగి నడిచాను" అనే పంక్తులు సామాజిక అంతరాలను అధిగమించడానికి అక్షరం ఎలా ఆయుధంగా మారుతుందో తెలియజేస్తాయి. బాహ్య గాయాల కంటే మనసుకు తగిలే గాయాలు ఎంత తీవ్రమైనవో ఈ కవిత మనల్ని ఆలోచింపజేస్తుంది.

**"తొవ్వ నేర్పిన పాఠం కవితలో...**
**ఆ తొవ్వను చూసినప్పుడల్లా**
**ఆకాశంలో చందమామను**
**చూసినంత ఆనందం అందరు**
**ఆ తొవ్వలో ముళ్ళుంటాయని**
**చెప్పులు తొడిగి నడిస్తే**
**నేను అక్షరాలు తొడిగి నడిచా"**

ఈ వాక్యాలు చదువు, జ్ఞానం పట్ల ఉన్న అపారమైన అనురాగాన్ని ఎంతో నర్మగర్భంగా ఆవిష్కరిస్తున్నాయి. ఆకాశంలో చందమామ ప్రశాంతమైన వెలుగును ఇచ్చినట్లే, జ్ఞానమార్గాన్ని (తొవ్వను) తలచుకున్నప్పుడల్లా మనసుకు అంతే ఆహ్లాదం కలుగుతుందని కవి ఉద్యేశం.




లోక విజేతలు కవితలో సమాజంలోని ఎన్నో ఆటంకాలను దాటుకుని, తమ ప్రతిభతో చరిత్రను తిరగరాసిన మహిళల సాహసాన్ని, వారి గెలుపును ఎంతో స్ఫూర్తిదాయకంగా వర్ణిస్తోంది. నిత్యం నిందలు వేసే సమాజపు మాటలను పట్టించుకోకుండా క్రీడారంగంలో ఆకాశమే హద్దుగా పరుగు తీసిన పి.టి. ఉష, వంటింటి పాత్రల శబ్దాల నడుమ సాధన చేసి ఆరుసార్లు ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచిన మేరీకోమ్, అంతరిక్షపు చీకట్లను చీల్చుకుంటూ సరిహద్దులు దాటి దూసుకెళ్లిన సునీతా విలియమ్స్ నిజమైన లోక విజేతలు. అలాగే, మహిళలకు చదువు ప్రాముఖ్యతను చాటుతూ వంటగది నుంచి బడిగదికి బాటలు వేసిన సావిత్రీబాయి పూలే, అంకితభావంతో ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్నే అధిరోహించిన మలావత్ పూర్ణ వంటి ప్రతి ఒక్కరూ స్త్రీ శక్తికి ప్రతిరూపాలు. అడుగడుగునా "ఆడదానివి ఇలా ఉండాలి" అంటూ సమాజం కట్టడి చేసినా, దౌర్జన్యాలను ఎదుర్కొని ఏటికి ఎదురీది నిలిచిన ప్రతి స్త్రీమూర్తీ ఈ జగత్తును గెలిచిన అసలైన విజేత అని కవి స్త్రీ సాధికారతను భావయుక్తంగా కవిత్వీకరించాడు.

డాక్టర్ గిన్నారపు ఆదినారాయణ కవిత్వం ఒక తీరని దాహం. తన చుట్టూ ఉన్న సమాజాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తూ, అత్యంత సాధారణమైన పదాలతో అసాధారణమైన భావాలను పండించడంలో ఆయన సంపూర్ణ విజయం సాధించారు. 'తొవ్వ నేర్పిన పాఠం' కవితా సంపుటి సమాజంలో మనుషుల సంతోషాలు, కన్నీళ్లు, సామాజిక అసమానతలు, అనుబంధాల కలబోతగా నిలుస్తుంది. కవి కేవలం అక్షరాలను అల్లడమే కాకుండా, తన అనుభవాలను, సామాజిక స్పృహను సున్నితమైన భావోద్వేగాలతో కవిత్వంగా మలచడం విశేషం. అమ్మ అనురాగాన్ని వర్ణించే శ్రమైక జీవన చిత్రణ నుండి పేదరికం, కాలంపై చేసిన వ్యంగ్యాత్మక విశ్లేషణల వరకు ప్రతి కవితా పాఠకుడి హృదయాన్ని స్పర్శిస్తుంది. ముఖ్యంగా, సామాజిక అణచివేతలను ఎదురించడానికి అక్షరాన్ని ఆయుధంగా మార్చుకోవాలని చెప్పిన తీరు, అలాగే స్త్రీ సాధికారతను కొనియాడిన వైనం ఈ సంపుటికి మకుటా యమానం. ఒకవైపు సామాజిక ఉద్యమ కెరటంలా, మరోవైపు వ్యక్తిగత అనుభూతుల కలబోతగా సాగిన ఈ పుస్తకం, "నడిచిన బాట నేర్పిన పాఠాలే జీవితానికి నిజమైన దారి" అని చాటిచెబుతుంది. ఆత్మీయ స్పర్శతో, నిరంతర అన్వేషణతో సాగుతున్న ఈ కవి ప్రయాణం సమకాలీన తెలుగు సాహిత్యంలో ఒక దిమ్మె లాంటి ప్రత్యేక స్థానాన్ని దక్కించుకోవడమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని గొప్ప రచనలకు వేదిక కావాలని ఆశిద్దాం.








ఓ పాకాల నీకేల వలపోత
వేల గడపల కలలు పండగ
ధాన్యరాశులై కడుపునిండగ
గగన గంగలా రైతు చెమటని
ఆవహించగా..!

బీళ్ళు వాలిన గుండెలల్లో
ఉడుకునెత్తురు పారినట్టుగ
చెమట చుక్కల తిరోగమనం
మేఘ గర్జన చెరువు నింపగ
పచ్చని పైరయ్యి సేదతీరింది..
నీ అలల తాకిడికి నా పంట పొలం..




నిండు జవరాలు పాకాల
నా తాలూకా కడుపు నింపగ
అడవుల్లో అందాల జనహోరు
చూడగ చెరువు గట్టుమీద ఆనాటి
ఇనుప నాగలి అరక గట్టి
పాకాల దున్నాలన్న ఆనందం, ఆవేశం
గణపతి దేవుడే పట్టి దున్నాడేమో అన్న భ్రాంతి..

కాకతీయుల ఆనవాళ్ళు మదిలో నిలుచు నిత్యం
ఉమ్మడి ఓరుగల్లుకు సాగునీటికి, తాగునీటికి
కొదువ కాదేమో పాకాల, రామప్ప, లక్నవరం
గొలుసుకట్టు చెరువులు తలకుపోసినట్టు
గంగలా పారునెపుడు
'వరంగల్లు' గుండె ధమనులై..

ఓ పాకాల నీకేల వలపోత
తర తరాలుగా గిరులు, భ్రూనులు దాటి
నీరుగా మా మడిలో జలకాలాడగా
పసిడి పంటలతో మురిసిపోయేను
మా రైతు మనసు..




శ్రీనివాస్ దాసరి
రీసెర్చ్ స్కాలర్, తెలుగు విభాగం
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
ఫోన్ : 7702665815


## నేటి తరానికి ఒక దిక్సూచి...

# తిలక్ కవిత్వం!

**సమాజం మారుతుంది. కాలం మారుతుంది. మనిషి జీవనశైలి మారుతుంది. కానీ కొందరు కవులు మాత్రమే కాలగమనాన్ని అధిగమించి ప్రతి తరానికీ కొత్తగా అర్థమవుతుంటారు. అలాంటి అరుదైన కవుల్లో ఒకరు దేవరకొండ బాలగంగాధర తిలక్! ఆయనది ఒక నిర్దిష్ట కాలానికి పరిమితమైన కవిత్వం కాదు. మానవ జీవితం, సమాజం, విలువలను నిరంతరం ప్రశ్నించే ఒక ఆలోచనల ప్రవాహం. అందుకే ఆయన కవిత్వాన్ని ఎన్ని సార్లు చదివినా.. చదివిన ప్రతిసారి కొత్త అర్థాలను ఆవిష్కరించుకుంటుంది. కాలం మారినా మనిషి అంతర్మథనం, సమాజంలోని వైరుధ్యాలు, జీవితపు అన్వేషణ మారవని ఆయన అక్షరాలు పదేపదే గుర్తుచేస్తాయి.**

**"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపరావతాలు...**
**నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు..."**

అని తన కవిత్వ స్వరూపాన్ని పరిచయం చేసిన తిలక్, కవిత్వాన్ని అలంకారాల ప్రదర్శనగా కాకుండా మానవ అనుభూతికి అద్దంగా తీర్చిదిద్దారు. ఆయన కవిత్వంలో భావుకత ఉంది, సామాజిక చైతన్యం ఉంది, ప్రేమ ఉంది, తిరుగుబాటు ఉంది, మానవత్వం ఉంది. అందుకే తిలక్ కవిత్వం చదవడం అంటే... ఒక యుగాన్ని, ఒక మనస్తత్వాన్ని, ఒక మానవీయ తత్వాన్ని చదవడం అని అర్థం. నేటి యువత డిజిటల్ ప్రపంచంలో జీవిస్తోంది. సమాచారం వేలి చివరికి చేరింది. కానీ సమాచారం పెరిగినంతగా వివేచన పెరుగుతుందా? సాంకేతికత అభివృద్ధి చెందినంతగా సున్నితత్వం పెరుగుతుందా? అనే ప్రశ్నలు మన ముందున్నాయి. సామాజిక మాధ్యమాల ప్రభావంతో స్పందించే ముందు, ఆలోచించడం తగ్గుతోంది. చదవడం కంటే స్క్రోల్ చేయడం అలవాటవుతోంది. ఇలాంటి క్లిష్ట సమయంలో యువతకు తిలక్ కవిత్వం అత్యంత అవసరం. తిలక్ కవిత్వం ప్రశ్నించడం నేర్పుతుంది. మూస ధోరణులను అనుసరించకుండా స్వతంత్రంగా ఆలోచించడం నేర్పుతుంది. జీవితాన్ని మార్కులు, ఉద్యోగం, సంపాదన అనే కొలమానాలతో మాత్రమే కాకుండా మానవ విలువల కోణంలో చూడాలని సూచిస్తుంది. అందుకే ఆయన కవిత్వం ఈ తరం యువతకు ఒక దిక్సూచిగా నిలుస్తుంది.

**"మేగ్నాకార్టా" అనే ఒక కవితలో...**
**"మాకు లోకం ఒక గీటురాయి**
**మాకు కరుణ చిగురు తురాయి**
**మేం పరపీడన సహించం**
**మేం దివ్యత్వం నటించం."** అని అంటారు తిలక్. ఈ నాలుగు పంక్తులు తిలక్ కవిత్వ తాత్విక దృక్పథాన్ని అత్యంత సంక్షిప్తంగా ఆవిష్కరిస్తాయి. ప్రపంచాన్ని మనిషి వ్యక్తిత్వానికి గీటురాయిగా, కరుణను మానవ జీవితానికి మూల విలువగా ఆయన ప్రతిపాదించారు. ఇతరుల బాధను చూసి మౌనంగా ఉండకూడదని, అదే సమయంలో గొప్పవారిగా నటిస్తూ కృత్రిమత్వాన్ని ప్రదర్శించకూడదని ఆయన స్పష్టం చేస్తారు. నేటి డిజిటల్ ప్రపంచంలో మనిషి స్పందన క్రమంగా 'లైక్', 'షేర్', 'కామెంట్'లకే పరిమితమవుతున్న సందర్భంలో ఈ పంక్తులు నేటి పరిస్థితులను సూటిగా ప్రశ్నిస్తున్నట్లుగా కనిపిస్తాయి. సామాజిక సమస్యలపై తాత్కాలిక స్పందన కంటే.. బాధ్యతాయుతమైన ఆలోచన, ప్రదర్శన కంటే.. మానవత్వం, వ్యక్తిగత విజయాల కంటే.. సామాజిక చైతన్యం గొప్పవని తిలక్ ఈ కవిత ద్వారా గుర్తు చేస్తారు. అందువల్ల ఆయన కవిత్వం యువతలో కేవలం సాహిత్యాస్వాదనను పెంపొందించడమే కాకుండా, బాధ్యతాయు తమైన పౌరస్పృహను, మానవీయ దృక్పథాన్ని పెంపొందించే శక్తిగా మిగిలి ఉంది.

తిలక్ కవిత్వం మానవత్వాన్ని మాత్రమే కాదు, మనిషి అంతరంగంలో జరిగే సంఘర్షణను కూడా అంతే గాఢంగా ఆవిష్కరిస్తుంది. సమాజాన్ని ప్రశ్నించినంత తీవ్రంగా తనను తాను కూడా ప్రశ్నించుకునే కవి ఆయన. అందుకే ఆయన కవిత్వంలో వ్యక్తి బాధ, సామాజిక బాధ్యత, ఆత్మపరిశీలన ఒకదానితో ఒకటి మిళితమై కనిపిస్తాయి. ఈ భావజాలాన్ని 'ఆర్తగీతం' అనే మరో కవితలో మరింత హృద్యంగా వ్యక్తీకరిస్తారు...

**"నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను,**
**సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగును,**
**మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను**
**పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్ప వలసిన వాణ్ణి**
**రసాతల మంట శిరస్సు వంచిన వాణ్ణి"**

అంటూ... సమాజం ఎదుర్కొంటున్న నైతిక సంక్షోభాన్ని కూడా ఆవిష్కరిస్తారు తిలక్. "కన్నీరుగా కరిగిన గీతిక", "దగ్ధమైన బూడిద" వంటి ప్రతీకల ద్వారా మనిషి అంతరంగంలో జరిగే సంఘర్షణను అత్యంత హృద్యంగా కవిత్వీకరించారు. అదే సమయంలో "పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్ప వలసిన వాణ్ణి" అనే పంక్తి మనిషి తన చర్యలకు బాధ్యత వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. నేటి యువత పోటీ, ఒత్తిడి, అనిశ్చితి, గుర్తింపు కోసం నిరంతరం పరుగులు పెడుతున్న పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ ఈ కవిత ఎంతో ఆలోచింపజేస్తుంది. జీవితంలో ఎదురయ్యే సంక్షోభాలను దాటవేయడం మాత్రమే కాదు, వాటిని ఎదుర్కొంటూ తన మానవత్వాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయమని తిలక్ ఈ కవిత ద్వారా సూచిస్తారు. అందుకే ఆయన కవిత్వాన్ని కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణగా మాత్రమే కాకుండా.. జీవితాన్ని లోతుగా అర్థం చేసుకునే ఒక తాత్విక దృక్పథంగా కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇలా... వ్యక్తి అంతరంగాన్ని ఆవిష్కరించిన తిలక్, సమాజంలో నిశ్శబ్దంగా జీవిస్తున్న సామాన్య మనిషి జీవితానికీ తన కవిత్వంలో సముచిత స్థానం కల్పించారు. గొప్ప వ్యక్తుల చరిత్రను మాత్రమే కాదు, ప్రతిరోజూ సమాజం కోసం శ్రమించే సాధారణ మనుషుల జీవితాలనూ కవితావస్తువుగా మలిచారు. అందుకే ఆయన కవిత్వం.. మనిషి విలువను హోదాతో కాకుండా, అతని జీవితానుభవాలతో కొలుస్తుంది. ఈ దృక్పథం 'తపాలా బంట్రోతు' కవితలో అత్యంత హృద్యంగా కనిపిస్తుంది.

**"అందరికీ నువ్వు ఆత్మబంధువువి**
**అందరికీ నువ్వు వార్త నందిస్తావు**
**కాని నీ కథనం మాత్రం నీటిలోనే మథనం అవుతూంటుంది.**
**ఇన్ని ఇళ్ళు తిరిగినా**
**నీ గుండె బరువు దింపుకోవడానికి ఒక్క గడప లేదు.**
**ఇన్ని కళ్ళు పిలిచినా**
**ఒక్క నయనం నీ కోటు దాటి లోపలకు చూడదు.**
**ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడిలాగా వెళ్లిపోయే నిన్ను చూచినప్పుడు**
**తీరం వదలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు."**

ఈ పంక్తుల్లో తిలక్ తపాలా బంట్రోతును ఒక ఉద్యోగిగా మాత్రమే కాకుండా... తన భావోద్వేగాలను తనలోనే దాచుకుని, ఇతరుల సుఖదుఃఖాలకు వారధిగా నిలిచే ప్రతి సాధారణ మనిషికి ప్రతీకగా మలిచారు. అందరి జీవితాల్లో ఆనందం, ఆశ, దుఃఖం, ఆందోళనలను చేరవేసే వ్యక్తి తన బాధను మాత్రం ఎవరికీ చెప్పుకోలేని ఏకాంతాన్ని తిలక్ అత్యంత హృద్యంగా కవిత్వీకరించారు. నేటి యువత కూడా సామాజిక మాధ్యమాల్లో వందలాది మందితో అనుసంధానమై ఉన్నప్పటికీ, తన మనసులోని బాధను పంచుకునే నిజమైన మనిషి కోసం వెతుకుతున్న పరిస్థితి కనిపిస్తుంది. వెలుపల నవ్వుతూ కనిపించే ప్రతి మనిషి అంతరంగంలో ఒక మౌన పోరాటం దాగి ఉండవచ్చని ఈ కవిత గుర్తుచేస్తుంది. అందుకే ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, మనుషులను కేవలం వారి పాత్రలతో కాకుండా వారి అంతరంగంతో చూడడం నేర్పించే జీవన పాఠంగా ఈ కవిత నేటి యువతకు మార్గనిర్దేశం చేస్తుంది.



తిలక్ ఏ సిద్ధాంతానికీ పూర్తిగా బానిస కాదు. అలాగే ఏ సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరించనూలేదు. ఆయనకు మనిషే కేంద్రబిందువు. అందుకే ఆయన కవిత్వంలో ఆకలితో అలమటించే మనిషి కనిపిస్తాడు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్న సైనికుడు కనిపిస్తాడు. కొడుకు కోసం ఎదురు చూసే తల్లి కనిపిస్తుంది. ఉత్తరం కోసం కళ్లప్పగించి నిలిచే యువతి కనిపిస్తుంది. పేదరికంతో పోరాడే కుటుంబం కనిపిస్తుంది. ఇవన్నీ నేటి సమాజంలో కూడా మారని దృశ్యాలే.

**"దేవుడా... రక్షించు నా దేశాన్ని..."** అని ప్రార్థించినప్పుడు కూడా ఆయన కోరుకున్నది ఒక్కటే... అదే మనిషి మనిషిగా జీవించే సమాజం. కడుపునిండా ఆహారం, గుండెనిండా ప్రేమ, జీవితమంతా స్వేచ్ఛ... ఇవే ఆయన కలలు. ఈ విలువలు నేటి ప్రపంచంలో మరింత అవసరమయ్యాయి.

అందుకే అనుభూతి కవి తిలక్ జన్మించిన ఈరోజున ఆయన్ను స్మరించుకుంటూ... ఆయన కవిత్వాన్ని చదవాలి, చర్చించాలి, కొత్త తరానికి చేరువ చేయాలి!


**మ్యాడం అభిలాష్,**
**కంటెంట్ రైటర్,**